గురువారం
23-06-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 02
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అఫ్గాన్‌లో భారీ భూకంపం

అఫ్ఘనిస్తాన్‌ను భారీ భూకంపం వణికించింది. దాదాపు వెయ్యి మందికిపైగా ప్రాణాలు కోల్పోగా 1500 మందికి గాయాలు అయ్యాయి. వందల ఇళ్లు పేకమేడల్లా కూలిపోయాయి. శిథిలాల కింద వందల మంది చిక్కుకున్నారు. దీంతో ఆ దేశమంతటా విషాదఛాయలు అలుముకున్నాయి.

2 లో

పేదల పక్షపాతి విశాలాంధ్ర

సమాజ ప్రగతిలో కమ్యూనిస్టు పత్రికల పాత్ర కీలకం

- ప్రజలను మరింత చైతన్యవంతులను చేయాలి
- నవ సమాజ నిర్మాణంలో కీలక భూమిక పోషించాలి
- విశాలాంధ్ర 70వ వార్షికోత్సవ సభలో వినయ్ విశ్వం

విశాలాంధ్ర 70వ వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తున్న వినయ్ విశ్వం, వేదికపై ఏటుకూరి ప్రసాద్, ఆర్వీ రామారావు, రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, ఓబులేసు, హరినాథ్‌రెడ్డి, దుర్గాభవానీ, మల్లికార్జునరావు, గద్దం కోటేశ్వరరావు, మనోహరనాయుడు, అజయ్‌బాబు

సభకు హాజరైన వారిలో ఓ భాగం

విశాలాంధ్ర-విజయవాడ: దేశంలో పత్రికలకు వార్షికోత్సవాలు కొత్తమే కాదనీ, నిస్వార్థంగా పేదల పక్షాన, సోషలిజం, ప్రజాస్వామ్య పక్షపాతిగా ఏడు దశాబ్దాలుగా నిరాటంకగా కొనసాగుతున్న విశాలాంధ్ర 70వ వార్షికోత్సవం ప్రత్యేకమైనదని, స్ఫూర్తిదాయకమైనదని సీపీఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వినయ్ విశ్వం అన్నారు. విశాలాంధ్ర దినపత్రిక 70వ వార్షికోత్సవ సభ బుధవారం సాయంత్రం నగరంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో వినయ్ విశ్వం మాట్లాడుతూ తాను కూడా కమ్యూనిస్టు జర్నలిస్టుగా పని చేశానన్నారు. కేరళలో జనయుగం మలయాళ పత్రికకు అతిచిన్న వయసులోనే సంపాదకుడి బాధ్యతలు నిర్వర్తించానని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తున్న ఆంగ్ల పత్రిక న్యూఏజ్‌కు సంపాదకుడిగా కొనసాగుతున్నానని తెలిపారు. రష్యాతోపాటు ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు పత్రికలు ప్రజల చైతన్యం, సమాజ ప్రగతిలో చరిత్రాత్మక పాత్ర పోషించాయని ఆయన వివరించారు. కమ్యూనిస్టు పత్రికలు కేవలం వార్తలకు మాత్రమే పరిమితం కావని, సమాజ మార్గనిర్దేశకులుగా పనిచేస్తాయని చెప్పారు. కమ్యూనిస్టు పత్రికలకు పోలీసులు, ప్రభుత్వాలు, పాలకవర్గాల నుంచి ప్రతిఘటనలు, న్యాయ, ఆర్థిక సమస్యలు ఎక్కువగా వస్తాయని, అయినా ప్రజలు, వామపక్ష ఉద్యమ అభిమానులు, శ్రేయోభిలాషుల అండదండలు, ఆదరణతో కొనసాగుతున్నాయని వినయ్ విశ్వం తెలిపారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలం విపక్ష పార్టీలకు అర్థమైందని, వాటిని అడ్డుకునేందుకు 17 పార్టీలు ఏకతాటిపైకి వచ్చి రాష్ట్రపతి అభ్యర్థిగా యశ్వంత్‌సిన్హాను ఎంపిక చేశాయని తెలిపారు. బీజేపీ తమ అభ్యర్థిగా ద్రౌపది ముర్మును ఎంపిక చేయడం కేవలం గిరిజన మహిళకు అత్యున్నత పదవి ఇస్తున్నామనే ప్రచార ఆర్భాటం కోసమేనని విమర్శించారు. మహిళలను గౌరవించే తత్వం ఆర్ఎస్ఎస్‌కు ఏనాడు లేదని

- మిగతా 2 లో

రూ. 34.6 వేల కోట్ల మోసం

- మరో భారీ బ్యాంక్ కుంభకోణం
- కేసు నమోదు చేసిన సీబీఐ
- డీహెచ్‌ఎఫ్ఎల్, వాధ్వాన్ ఇళ్లల్లో సోదాలు

న్యూఢిల్లీ: దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (డీహెచ్‌ఎఫ్ఎల్), దాని మాజీ ప్రమోటర్లు కపిల్ వాధ్వాన్, ధీరజ్ వాధ్వాన్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. యూనియన్ బ్యాంక్ నేతృత్వంలోని కన్సార్షియాన్ని రూ.34,615 వేల కోట్ల మేర మోసగించిందన్న అభియోగాలపై సీబీఐ ఈ కేసు నమోదు చేసింది. బ్యాంకులను మోసగించిన వ్యవహారంలో సీబీఐ నమోదు చేసిన కేసుల్లో ఇదే అతిపెద్ద మోసంగా నిలిచింది. ఇప్పటివరకు ఏబీజీ షిప్‌యార్డ్స్ కంపెనీ (రూ.22,842 కోట్లు) చేసిన మోసమే అతిపెద్దది. డీహెచ్‌ఎఫ్ఎల్ కేసులో బుధవారం ముంబైలోని 12 చోట్ల సోదాలు నిర్వహించినట్లు సీబీఐ అధికారులు పేర్కొన్నారు. 50 మంది అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. సోదాల అనంతరం డీహెచ్‌ఎఫ్ఎల్, కపిల్, ధీరజ్ వాధ్వాన్‌తో పాటు అమరిల్లీస్ రియల్టర్స్‌కు చెందిన సుధాకర్ శెట్టి, మరో ఆరుగురు బిల్డర్లపై కేసు నమోదు చేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. బ్యాంకు కన్సార్షియం 2010 నుంచి 2018 మధ్య రూ.42,871 కోట్ల మేర రుణాలు సమకూర్చినట్లు యూనియన్ బ్యాంక్ తెలిపింది. 2019 నుంచి తిరిగి చెల్లింపులు నిలిచిపోయినట్లు సీబీఐకి 2021లో ఆ బ్యాంక్ లేఖ రాసింది. తాము కేపీఎంజీ సంస్థతో ఆడిట్ నిర్వహించినప్పుడు వివిధ అంశాలు వెలుగులోకి వచ్చినట్లు యూనియన్ బ్యాంక్ పేర్కొంది. డీహెచ్‌ఎఫ్ఎల్ నిబంధనల ఉల్లంఘనతో పాటు ఆర్థిక అవకతవకలు, నిధుల మళ్లింపు వంటి చర్యలకు పాల్పడినట్లు గుర్తించామని యూనియన్ బ్యాంక్ ఈ ఏడాది ఫిబ్రవరి 11న సీబీఐకి ఫిర్యాదు చేసింది. దీనిపై సీబీఐ తాజాగా తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేసింది. మరోవైపు ఎస్ బ్యాంక్ వ్యవహారంలో ఇప్పటికే డీహెచ్‌ఎఫ్ఎల్ మాజీ ప్రమోటర్లు ఇద్దరూ జైల్లో ఉన్నారు. డీహెచ్‌ఎఫ్ఎల్‌ను గతేడాది పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్ (పీఈఎల్) కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

ఇంటర్‌లోనూ అంతే!

- తగ్గిన ఉత్తీర్ణత
- అమ్మాయిలదే పైచేయి
- 72 శాతంతో కృష్ణా ప్రథమస్థానం
- 50శాతం ఉత్తీర్ణతతో కడప చివరి స్థానం
- రెండేళ్ల ఫలితాలు విడుదల చేసిన మంత్రి బొత్స
- ఆగస్టు 3నుంచి 12వరకు సప్లిమెంటరీ పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాలలో బాలికలు సత్తా చాటారు. విజయవాడ మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో బుధవారం ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం పరీక్ష ఫలితాలను మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేశారు. మంత్రి బొత్స మాట్లాడుతూ రాష్ట్రంలో 8,69,059 మంది రెగ్యులర్ విద్యార్థులు, 72,299 మంది ఒకేషనల్ కోర్సు విద్యార్థులు పరీక్షలు రాయగా..మొదటి సంవత్సరానికి సంబంధించి 54శాతం మంది, రెండవ సంవత్సరానికి సంబంధించి 61శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. మొత్తం ఇంటర్మీడియేట్ పరీక్ష ఫలితాలలో బాలురు కంటే బాలికలే పైచేయిగా నిలిచారని, మొదటి సంవత్సరంలో బాలురు 49 శాతం ఉత్తీర్ణత సాధిస్తే, బాలికలు 60శాతం ఉత్తీర్ణత సాధించారని, రెండవ సంవత్సరంలో బాలురు 54శాతం ఉత్తీర్ణత సాధిస్తే బాలికలు 68శాతం ఉత్తీర్ణత సాధించారని మంత్రి అన్నారు. ఉమ్మడి జిల్లాల్లో కృష్ణా జిల్లా 72శాతంతో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవగా, కడప జిల్లా 50శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచిందని మంత్రి అన్నారు. ఇంటర్ పరీక్షలు అత్యంత పారదర్శకంగా నిర్వహించామని, 2022 మే 6 నుండి మే 25 వరకు పరీక్షలు నిర్వహించగా మే 18 నుండి జూన్ 14 వరకు స్పాట్ వాల్యూయేషన్ నిర్వహించామన్నారు. మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 4,45,604 మంది పరీక్షలు రాయగా, 2,41,591 మంది ఉత్తీర్ణత సాధించారని, రెండవ సంవత్సరానికి సంబంధించి 4,23,455 మంది పరీక్షలు రాయగా 2,58,449 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులు రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25వ తేదీ నుండి జులై 5వ తేదీ వరకు అవకాశం

- మిగతా 2 లో

అమరావతి ఉద్యమానికి అండ

సీపీఐ జాతీయ కార్యదర్శి వినయ్ విశ్వం

2లో

బీజేపీ అనైతిక రాజకీయాలు

- దొడ్డిదారిన అధికారం కోసం ఆరాటం
- 2014 నుంచి ఏడు రాష్ట్రాలు
- ఇప్పుడు మహారాష్ట్ర వంతు

న్యూఢిల్లీ: 'ఓట్లు, సీట్లు మీవి...అధికారం మాది' ఇదీ బీజేపీ రాజకీయ తంత్రం. 2014 నుంచి బీజేపీ ఇదే విధానం అమలు చేస్తోంది. బీజేపీకి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదు. అశేష ప్రజానీకం ఇచ్చిన తీర్పుపైనా గౌరవం లేదు. ఎన్నికల ప్రక్రియతోనూ పనిలేదు. ఓట్లు ఎవరికి వేసినా..ఎవరికి మెజార్టీ వచ్చినా చివరికి అధికారం మాత్రం తమకే దక్కాలన్నది బీజేపీ కుతంత్రం. పొరపాటున ఏ పార్టీ అయినా అధికార పీఠం ఎక్కినా ఎంతోకాలం దానిని కొనసాగనివ్వరాదన్నది బీజేపీ నమ్మిన సిద్ధాంతం. ఎవరు అధికారంలోకి వచ్చినా...కుర్చీ మాత్రం తమకే దక్కాలన్నది కాషాయపార్టీ లక్ష్యం. ఇందుకోసం ఎంతకైనా దిగజారుతుంది. తమకు అధికారం దక్కేదాకా..ఎవరినైనా ఎలాగైనా..మభ్యపెడుతోంది..ప్రలోభ పెడుతోంది లేదా బెదిరింపులకు పాల్పడుతుంది. ఇదీ బీజేపీ నైజం. ప్రాంతీయ అస్తిత్వాలను కాలరాయడం, విపక్షాలను పూర్తిగా నిర్వీర్యం చేయడం, నియంతృత్వంగా వ్యవహరించడం స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగనిది. 2014లో మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విపక్ష ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో తిరుగుబాటుదారులను తయారు చేయడం.. ఇందుకోసం ఈడీ, సీబీఐ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను వినియోగించుకొని బెదిరింపులతో లొంగదీసుకోవడం యథావిధిగా కొనసాగుతోంది. తిరుగుబాటుదారులు బీజేపీ తీర్థం తీసుకున్న తర్వాత...దర్యాప్తులన్నీ మటుమాయమవుతాయి. ఇదీ మోదీ బీజేపీ సిద్ధాంగం. మోదీ బీజేపీ..2014 నుంచి ఆరు రాష్ట్రాల్లో తనకు మెజార్టీ లేకున్నా అధికారంలోకి రావడమే ఇందుకు ఉదాహరణ. తాజాగా మహారాష్ట్రలో ఇదే క్రీడ ప్రారంభమైంది. మోదీ హయాంలో ఏయే రాష్ట్రాల్లో అన్యాయంగా, అక్రమంగా బీజేపీ అధికారం చేపట్టిందో చూద్దాం...

ముందుగా అరుణాచల్ ప్రదేశ్‌పై బీజేపీ తన రాజకీయ క్రీడ ప్రారంభించింది. అరుణాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ మొదట అడుగువేసింది. 2014లో అరుణాచల్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో 60 సీట్లకు 42 సీట్ల భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. బీజేపీ 11 సీట్లతో సరిపెట్టుకొన్నది. 2016 నాటికి పరిస్థితి అంతా మారిపోయింది. ముందుగా నాబం టుకి ముఖ్యమంత్రి అయ్యారు. 2016 జులైలో కాంగ్రెస్ ఎమ్మెల్యే పెమాఖండు మొత్తం 40 మంది ఎమ్మెల్యేలతో పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్‌లో చేరి..బీజేపీ లోపాయికారి మద్దతుతో అధికారంలో కొనసాగారు. ఏడాది తరువాత బీజేపీలో ఆ పార్టీని విలీనం చేశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో విజయంతో కాషాయపార్టీ రెచ్చిపోయింది.

తర్వాత కర్ణాటకపై మనసు పడింది. 2019 ఎన్నికల తరువాత కర్ణాటకలో జేడీ(ఎస్)-కాంగ్రెస్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

'మహా' ఉత్కంఠ

- సీఎంగా ఏక్‌నాథ్ షిండేకు అవకాశం
- శివసేనకు ఎన్సీపీ, కాంగ్రెస్ సూచన
- సీఎంగా రాజీనామాకు సిద్ధమన్న ఉద్ధవ్
- సొంత పార్టీ నేతల తిరుగుబాటుపై భావోద్వేగం
- ప్రభుత్వ ఏర్పాటునకు బీజేపీ కసరత్తు

మహారాష్ట్రలో రాజకీయపరంగా ఉత్కంఠ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహా వికాస్ అగాదీ ప్రభుత్వం పతనం అంచునకు చేరుకుంది. తిరుగుబాటు నేత ఏక్‌నాథ్ షిండేకు ఎమ్మెల్యేల మద్దతు పెరిగింది. అర్ధరాత్రి పరిణామాలతో అందరి దృష్టి సూరత్ నుంచి గువహతికి మళ్లింది.

2లో

అఫ్గాన్‌లో భారీ భూకంపం

- 1000 మంది మృతి - 1500 మందికి గాయాలు
- పాక్తికా, ఖోస్త్‌పై తీవ్ర ప్రభావం - భారీగా ప్రాణ-ఆస్తి నష్టం
- కుప్పకూలిన ఇళ్లు - శిథిలాల కింద అనేకమంది
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- అంతర్జాతీయ సాయం కోసం ఎదురుచూపు

కాబూల్ : అఫ్ఘనిస్తాన్‌ను భారీ భూకంపం వణికించింది. దాదాపు వెయ్యి మందికిపైగా ప్రాణాలు కోల్పోగా 1500 మందికి గాయాలు అయ్యాయి. వందల ఇళ్లు పేకమేడల్లా కూలిపోయాయి. శిథిలాల కింద వందల మంది చిక్కుకున్నారు. దీంతో ఆ దేశమంతటా విషాదఛాయలు అలుముకున్నాయి. అర్తనాధాలు మిన్నంటాయి. ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో ఉన్న అఫ్గాన్ అనేక ఆంక్షలను ఎదుర్కొంటూ అంతర్జాతీయ సాయంపై ఆధారపడుతోంది. తాజా పరిస్థితి నుంచి బయట పడేందుకు ఆపన్నహస్తం అందజేయాలని కోరుతోంది. పాకిస్తాన్ సరిహద్దు సమీపంలోని ఖోస్త్ నగరానికి 44 కిమీల దూరంలో స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 1.30 గంటలకు భూకంపం సంభవించిందని, అంతా తమ ఇళ్లలో నిద్రపోతున్నారని అధికారులు బుధవారం తెలిపారు. భూకంపం తీవ్రత 6.1గా రిక్టర్ స్కేల్‌పై నమోదు కాగా దాని ప్రభావంతో పాకిస్థాన్, భారత్‌లోనూ పలుచోట్లు భూమి కంపించినట్లు యూరప్‌కు చెందిన భూకంపం పరిశీలన కేంద్రం వెల్లడించింది. అఫ్గాన్‌లోని పాక్తికా ప్రావిన్స్‌లో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. 255 మంది చనిపోగా 200 మందికిపైగా గాయపడ్డారని అంతర్గత వ్యవహారాల అధికారి సలాహుద్దీన్ అయ్యూబీ తెలిపారు. ఖోస్త్ ప్రావిన్స్‌లో 25 మంది చనిపోగా 90 మంది ఆసుపత్రిలో ఉన్నట్లు బక్తార్ వార్తాసంస్థ తెలిపింది. మృతుల సంఖ్య పెరగవచ్చునని, హెలికాప్టర్ ద్వారా సహాయక చర్యలు సాగుతున్నాయని వార్తా సంస్థ డైరెక్టర్ జనరల్ అబ్దుల్ వాహిద్ రయాన్ ట్వీట్ చేశారు. పాక్తికాలో 90 ఇళ్లు కూలిపోగా అనేక మంది శిథిలాల కింద ఉన్నట్లు పేర్కొన్నారు. భూకంపం కారణంగా అఫ్గాన్, పాకిస్తాన్, భారత్‌లో దాదాపు 500 కిమీల వరకు భూ ప్రకంపనలు సంభవించినట్లు యూరోపియన్ సియస్మాలజికల్ ఏజన్సీ (ఈఎంఎస్‌సీ) పేర్కొంది. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలింపులు కొనసాగుతున్నట్లు సహాయక బృందాలు వెల్లడించాయి. తాజా పరిస్థితుల్లో అంతర్జాతీయ సహాయాన్ని తాలిబన్లు కోరినట్లు యూనిసెఫ్ కాబూల్ శాఖకు చెందిన

శాంమోర్ట్ తెలిపారు. బ్రిటన్ ఇప్పటికే ఐరాసతో సంప్రదింపులు జరుపుతోందని, అంతర్జాతీయ స్పందన క్రమంలో తమ వంతు తోడ్పాటుకు సిద్ధంగా ఉందని అఫ్గాన్‌కు బ్రిటన్ ప్రత్యేక ప్రతినిధి నైజల్ కాసే అన్నారు. శవాల మధ్య ఉన్న తమకు సాయం అందేది ఎప్పుడంటూ మారుమూల గ్యాన్ గ్రామానికి చెందిన రైతు ఆలెం వఫా ఆవేదన వ్యక్తంచేశారు. తమ గ్రామంలో 40 మందికిపైగా చిన్నారులు చనిపోయారన్నారు. గాయపడిన వారందరికీ చికిత్స అందించేంత సామర్థ్యం తమ ఊరిలోని ఆసుపత్రికి లేదన్నారు.

ఆఫ్రికా సంక్షోభాలపై గుటెర్రస్ ఆందోళన

విశాలాంధ్ర ప్రపంచం

కైరో : ఆఫ్రికా ఎదుర్కొంటున్న బహుళ సంక్షోభాలు, ముఖ్యంగా ఆహార భద్రత, వాతావరణ మార్పులు, ఉగ్రవాద వ్యతిరేక పోరుపై అస్వాన్ ఫోరమ్ మంగళవారం ప్రారంభమైంది. ఈజిప్ట్ రాజధాని కైరోలో జరిగిన సదస్సులో ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ వీడియో సందేశంలో మాట్లాడుతూ ఆఫ్రికా ప్రజలు వివిధ సంక్షోభాలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. కోవిడ్-19 మహమ్మారి వల్ల ఏర్పడిన ఆర్థిక సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ వివాదం కారణంగా ఏర్పడిన ధరల పెరుగుదల, వ్యాక్సిన్‌లకొరత, ఆర్థిక సంక్షోభం, తీవ్రవాదం, సంఘర్షణల సంక్షోభం, వాతావరణ సంక్షోభంతో ఆఫ్రికా అట్టుడుకుతోంది. ఉపాధి కల్పన, పేదరికం తగ్గింపు, సామాజిక రక్షణ, ఆహార భద్రత, హరిత వృద్ధిలో పెట్టుబడులు పెట్టవచ్చని ఆఫ్రికా ఖండానికి రుణసదుపాయం అవసరమని గుటెర్రెస్ తెలిపారు.

ఇంటర్‌లోనూ అంతే...

(మొదటిపేజీ తరువాయి)

కల్పించామన్నారు. ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఇందుకోసం జులై 8వ తేదీ లోగా పరీక్ష ఫీజు చెల్లించ వలసి ఉంటుందన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు ఆగస్టు 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిర్వహిస్తారని, ప్రాక్టికల్ పరీక్షలు ఆగస్టు 17 నుండి 22 వరకు జిల్లా కేంద్రాల లో నిర్వహిస్తారని మంత్రి బొత్స వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఇంటర్మీడియేట్ విద్యామండలి సెక్రటరీ, కమిషనర్ ఎంవీ. శేషగిరిబాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జీవీ ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అనైతిక రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. ఆ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకోవడంతో ముందుగా బీజేపీకి గవర్నర్ అవకాశమిచ్చారు. యెదియూరప్ప అధికారంలోకి వచ్చారు. కానీ మెజార్టీ లేకపోవడంతో విశ్వాసపరీక్షకు ముందే రాజీనామా చేయాల్సి వచ్చింది. తరువాత కుమారస్వామి కాంగ్రెస్ మద్దతుతో ముఖ్యమంత్రి అయ్యారు. మోదీ బీజేపీకి ఇది మింగుడుపడలేదు.16 మంది ఎమ్మెల్యేలను లొంగదీసుకొని కుమారస్వామి సర్కారును కుప్పకూల్చారు. తిరిగి బీజేపీ ప్రభుత్వం గద్దెనెక్కింది. ఇదే తరహాలు బీజేపీ పాగా వేసిన మూడో రాష్ట్రం మధ్యప్రదేశ్. 2018 ఎన్నికల్లో 121 మంది ఎమ్మెల్యేల మద్దతుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కమల్‌నాథ్ ముఖ్యమంత్రి అయ్యారు. యువ నాయకుడు జ్యోతిరాదిత్య సింధియాతోపాటు 26 మంది ఎమ్మెల్యేలను తనవైపు తిప్పుకోవడంతో కమల్‌నాథ్ సర్కారు కూలిపోయింది. సింధియా కేంద్రమంత్రి అయ్యారు. 2017లో జరిగిన ఎన్నికల్లో మణిపూర్‌లో కాంగ్రెస్ 27 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయింది. 21 సీట్లే వచ్చిన బీజేపీని గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. 9 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను లొంగదీసుకొన్న బీజేపీ...దొడ్డిదారిన అధికారం చేపట్టింది. గోవాలోనూ ఇదే పరిస్థితి. 2017లో జరిగిన ఎన్నికల్లో.. 40 స్థానాలకుగాను.. 17 సీట్లు గెలుచుకొని కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. మెజార్టీకి నాలుగు సీట్ల దూరంలో ఉండిపోయింది. కేవలం 13 సీట్లు గెలుచుకొన్న బీజేపీ ముందుగా ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యేను తనవైపు లాక్కున్నది. తరువాత పదిమందిని ఫిరాయించేలా చేసింది. కాంగ్రెస్ మేలుకొనకముందే బీజేపీ అధికారంలోకి వచ్చింది.

సిక్కింలో మరీ విచిత్రం. 2019 లో సిక్కిం అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బీజేపీకి ఒక్కటంటే ఒక్క సీటు కూడా రాలేదు. పైగా పోటీచేసిన అన్ని స్థానాల్లోనూ డిపాజిట్లు పోగొట్టుకున్నది. ఇప్పుడు ఆ పార్టీకి అక్కడ 12 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్‌కు చెందిన 12 మంది ఎమ్మెల్యేలు (మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామింగ్ మినహా) అందరూ బీజేపీలో చేరిపోయారు. పుదుచ్చేరిలో కాంగ్రెస్‌తోపాటు డీఎంకేకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకొన్నది. రాజస్థాన్‌లో సైతం అధికారాన్ని చేజిక్కించుకోవడానికి బీజేపీ శతవిధాలా ప్రయత్నించింది. సచిన్ పైలట్‌ను తనవైపు తిప్పుకోవడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. దీంతో అక్కడ కాంగ్రెస్ ఊపిరి పీల్చుకున్నది. తాజాగా మహారాష్ట్రలోనూ బీజేపీ అదే రాజకీయం చేస్తున్నది.

అగ్నిపథ్‌కూ సాగు చట్టాల గతే

రాహుల్‌గాంధీ జోస్యం

న్యూఢిల్లీ: అగ్నిపథ్ పథకం ద్వారా కేంద్రం సైన్యాన్ని బలహీనపరుస్తోందని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ బుధవారం విమర్శించారు. సాగు చట్టాల మాదిరిగా ఈ పథకాన్ని కూడా ప్రధాని నరేంద్రమోదీ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ తనను ప్రశ్నించిన సమయంలో మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు రాహుల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈడీ ప్రశ్నిస్తున్న సమయంలో తాను ఒంటరిని కాదని, ప్రజాస్వామ్యం కోసం పోరాడే వారంతా తనతో ఉన్నారని ఆయన అన్నారు. దేశంలో అతిపెద్ద సమస్య ఉద్యోగాలేనని, చిన్న, మధ్యతరహా వ్యాపారాలు హాని కలిగించడం ద్వారా దేశం వెన్నెముకను మోదీ సర్కారు విరిచేసిందని రాహుల్ విమర్శించారు. ఈడీ తనను ప్రశ్నించిన తర్వాత తనకు సంఘీభావం తెలిపిన వారికి కృతజ్ఞతలు తెలపడానికి రాహుల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో తమ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో రాహుల్ మాట్లాడారు.

మోదీ ఇద్దరు ముగ్గురు పారిశ్రామికవేత్తలకు దేశాన్ని కట్టబెట్టారని ఆరోపించారు. చివరిగా సైన్యంలో ఉద్యోగాలకు సైతం స్వస్తి చెప్పారని మండిపడ్డారు. వన్ ర్యాంక్-వన్ పెన్షన్ గురించి పదేపదే మాట్లాడిన మోదీ...ఇప్పుడు నో ర్యాంక్-నోపెన్షన్ అంటున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. చైనా సైన్యం మన భూభాగంగాపై తిష్ట వేసిందని, ఈ సమయంలో సైన్యాన్ని బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం..దారుణంగా బలహీనపరుస్తోందని ఆరోపించారు. ఇది దేశానికి హాని చేస్తుందని, అలాంటి వారు జాతీయవాదులుగా చెప్పుకుంటున్నారని రాహుల్ అన్నారు. 'మోదీజీ..సాగు చట్టాలు వెనక్కి తీసుకుంటరాని నేను అప్పుడే చెప్పాను. అదే జరిగింది. అగ్నిపథ్ పథకాన్ని మోదీ వెనక్కి తీసుకుంటారని కాంగ్రెస్ చెబుతోంది. దీనికి సంబంధించి యువత అంతా తమకు అండగా నిలబడింది' అని రాహుల్ తెలిపారు.

రేపు ముర్ము నామినేషన్

న్యూఢిల్లీ : ఎన్డీయే తరపు రాష్ట్రపతి అభ్యర్థిగా ద్రౌపది ముర్ము ఈనెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆమె వెంట ప్రధాని మోదీతో పాటు అనేకమంది కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, మద్దతిచ్చే పార్టీల కీలక నేతలు ఉంటారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ముర్ము తరపు ప్రధాని మోదీ మొదటి ప్రతిపాదకునిగా ఉంటారని పేర్కొన్నాయి. రాష్ట్రపతి అభ్యర్థిగా ఆమె/అతను నామినేషన్ వేయాలంటే 50 ప్రతిపాదకులు - 50 సెకండర్లు (మద్దతుదారులు) ఉండాలని బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పార్టీ నేతలతో సమావేశాన్ని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నిర్వహించారు. ముర్ము తరఫున ప్రచారం చేసేందుకు వారు దేశమంతటా ప్రయాణిస్తారు. రాష్ట్రపతి ఎలక్టోరల్ కాలేజి సభ్యులను కలిసి తనకు మద్దతివ్వాలని ముర్ము కోరనున్నారు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా యశ్వంత్ సిన్హా ఎంపికైన విషయం తెలిసిందే. రాష్ట్రపతి ఎన్నిక వచ్చేనెల 18వ తేదీన జరుగుతుంది. ముర్ము (64) జార్ఖండ్ మాజీ గవర్నర్. ఒడిశాకు చెందిన గిరిజన నాయకురాలు. ఆమె రాష్ట్రపతిగా ఎన్నిక అయితే ఆ రాష్ట్రం తరపునే కాదు మొదటి గిరిజన రాష్ట్రపతిగా నిలుస్తారు. ముర్ము గెలుపునకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. బీజేడీ ఇప్పటికే మద్దతివ్వగా బీజేపీ వద్ద మెజారిటీ ఉంది. ఇక వైఎస్ఆర్ కాంగ్రెస్, ఏఐఏడీఎంకే వంటి ప్రాంతీయ పార్టీల మద్దతుపైనా అంచనాలు ఉన్నాయి.

'మహా' ఉత్కంఠ

ముంబై : మహారాష్ట్రలో రాజకీయపరంగా ఉత్కంఠ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహా వికాస్ అగాదీ ప్రభుత్వం పతనం అంచునకు చేరుకుంది. తిరుగుబాటు నేత ఏక్‌నాథ్ షిండేకు ఎమ్మెల్యేల మద్దతు పెరిగింది. అర్ధరాత్రి పరిణామాలతో అందరి దృష్టి సూరత్ నుంచి గువహటికి మళ్లింది. మహారాష్ట్రలో శివసేన నిలబడాలంటే కాంగ్రెస్, ఎన్సీపీ దానికి దూరం కావాల్సిందేనని షిండే అన్నారు. ఎంవీయే ప్రభుత్వం ఏర్పాటు వల్ల శివసేన నష్టపోగా ఆ రెండు పార్టీలు లబ్ధి పొందాయని, ఈ అసహజ మైత్రిని వీడన్నారు. తాజా పరిణామాలపై ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే ఫేస్‌బుక్ ద్వారా 17 నిమిషాల పాటు ప్రసంగించారు. ఒక్క ఎమ్మెల్యే తన వద్దకు వచ్చి సీఎంగా కొనసాగవద్దు అని చెప్పినా ఆ పదవినే కాదు శివసేన అధ్యక్షుడిగానూ తప్పుకుంటానని ప్రకటించారు. తన అనుకున్న వారే మోసం చేశారంటూ భావోద్వేగానికి లోనయ్యారు. తదుపరి ముఖ్యమంత్రి అయ్యేది శివసేన న్యాయకుడేనన్న హామీని కోరారు. తాజా పరిస్థితుల దృష్ట్యా తిరుగుబాటు బావుటా ఎగురవేసిన ఏక్‌నాథ్ షిండేకు ముఖ్యమంత్రి పీఠాన్ని కట్టబెట్టడం సబబుగా ఉంటుందన్న అభిప్రాయాన్ని ఎన్సీపీ, కాంగ్రెస్ వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సుప్రియా సూలే, జితేంద్ర అవద్‌తో కలిసి సీఎం నివాసానికి వెళ్లిన ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ దాదాపు గంటకుపైగా ఉద్ధవ్ ఠాక్రేతో సమావేశమైన క్రమంలో షిండేను సీఎం చేయాలని సూచించినట్లు సమాచారం. తాజా ప్రతిపాదనపై షిండే స్పందన తెలియాల్సి ఉంది. అయితే ఎన్సీపీ, కాంగ్రెస్‌తో అసహజ కూటమిని విడనాడి బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని షిండే డిమాండు చేశారు. ఉద్ధవ్ ఫేస్‌బుక్‌లో ప్రసంగించిన తర్వాత షిండే స్పందించారు. అసహజన కూటమి నుంచి బయటకు వస్తేనే పార్టీ మనుగడ సాగించగలదని, మహారాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. తాను శివసైనికుడినేనని, బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నానన్నారు. సాయంత్రం 5 గంటలకు సీఎం నిర్వహించే సమావేశానికి తిరుగుబాటు చేసిన వారు సహా ఎమ్మెల్యేలంతా హాజరు కావాలని లేకపోతే అనర్హత వేటు, ఫిరాయింపు చట్టం కింద చర్యలు తప్పబోవని శివసేన అల్టిమేటం ఇవ్వడం చట్టవిరుద్ధమని షిండే అన్నారు.

ప్రభుత్వంలో అవినీతి జరుగుతున్నట్లు తిరుగుబాటు వర్గం ఆరోపణలు చేసింది. పార్టీ సిద్ధాంతాలతో రాజీ పడి సైద్ధాంతిక ప్రత్యర్థులతో కలిసి అధికారాన్ని పంచుకోవడాన్ని కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారంటూ పేర్కొంది. శివసేన కార్యకర్తలపై కాంగ్రెస్, ఎన్సీపీ ఆధిపత్యం కొనసాగుతోందని, ప్రభుత్వంలో అవినీతిపై పార్టీ ఎమ్మెల్యేలు, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి ఉందని తెలిపింది. అవినీతికి అనిల్ దేశ్‌ముఖ్, నవాబ్ మాలిక్‌ను ఉదహరించింది. ఏక్‌నాథ్ షిండేకు తొలుత 34 మంది శివసేన ఎమ్మెల్యేలు, ఐదుగురు స్వతంత్రుల మద్దతు ఉండగా సూరత్ నుంచి గువహటి క్యాంపుకు చేరేసరికి ఆ సంఖ్య 46కు పెరిగింది. తమ వర్గ నేతగా షిండేను గుర్తించాలని గవర్నర్ కోశ్యారికి లేఖను రెబల్స్ రాశారు. అసెంబ్లీలో బల పరీక్షనూ కోరారు.

ఇదిలావుంటే, అసెంబ్లీ రద్దు విషయమై గవర్నర్‌తో ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే చర్చించారు. కానీ, నిర్ణయాన్ని వాయిదా వేశారు. ఇదే క్రమంలో రాష్ట్ర కేబినెట్ అత్యవసరంగా సమావేశం అయి తాజా పరిస్థితులను చర్చించింది. సమావేశానికి షిండేతో సహా ఎనిమిది మంది మంత్రులు గైర్హాజరయ్యారు. రాష్ట్రంలోని తాజా పరిస్థితులు అసెంబ్లీ రద్దుకు దారితీస్తున్నాయని పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ అంతకుముందు వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలంతా తిరిగి పార్టీలోకి వచ్చేస్తారన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తంచేశారు.

మరోవైపు రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు బీజేపీ సిద్ధమవుతోంది. ఇదే విషయమై తమ పార్టీ నేతలతో బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవిస్ కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఠాక్రేను పదవి నుంచి తప్పించే అంశంపై చర్చించారు. ప్రస్తుతం బీజేపీకి 106 ఎమ్మెల్యేల మద్దతు ఉంది. అధికారంలోకి రావాలంటే ఇంకో 37 మంది అవసరం ఉంటుంది. ఈ లోటు షిండే వర్గం ద్వారా భర్తీ చేసుకొనే వెసులుబాటు బీజేపీకి ఉంది.

రెబల్స్‌పై చర్యలకు కార్యకర్తల డిమాండు - ఔరంగబాద్‌లో నిరసనలు

శివసేన పార్టీ రెండుగా చీలిపోయింది. ఉద్ధవ్‌కు మద్దతిచ్చేవారిది ఒక వర్గం కాగా రెబల్స్‌ది మరో వర్గంగా ఉంది. దీంతో పరస్పరం విమర్శించుకునే పరిస్థితి ఏర్పడింది. ఇదే క్రమంలో తిరుగుబాటు నేతలకు వ్యతిరేకంగా శివసేన కార్యకర్తలు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ నగరంలో ధర్నా చేపట్టారు. తిరుగుబాటు నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. తిరుగుబాటు నేత ఏక్‌నాథ్ షిండే వెంట ఔరంగాబాద్ జిల్లాకు చెందిన కనీసం ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు.

శివసేన అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ అంబాదాస్ దాన్వే మాట్లాడుతూ, ఉద్ధవ్ ఠాక్రేపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని, తాము ఆయన వెంటే ఉన్నామని, పార్టీని వీడిన వారిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. రెబల్స్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలని కార్యకర్తలు డిమాండు చేశారు.

కాంగ్రెస్ నేతలెవ్వరూ అమ్మకానికి లేరు.. : కమల్‌నాథ్

కాంగ్రెస్ ఎమ్మెల్యేలెవ్వరూ అమ్మకానికి లేరని, పార్టీ నాయకులంతా ఐక్యంగానే ఉన్నారని సీనియర్ నేత కమల్‌నాథ్ అన్నారు. తమ ఎమ్మెల్యేలను ఏ విధంగా గాడిలో పెట్టాలన్నది శివసేన చూసుకోవాలని వ్యాఖ్యానించారు. రాష్ట్ర పరిస్థితుల దృష్ట్యా ఆయనను ఏఐసీసీ పరిశీలకునిగా నియమించిన క్రమంలో ముంబై చేరుకున్న అనంతరం కమల్‌నాథ్ విలేకరులతో మాట్లాడారు. శరద్‌పవార్‌తోనూ భేటీ అయ్యారు.

అమరావతి ఉద్యమానికి అండ

ఆధునిక తుగ్లక్ జగన్

సీపీఐ జాతీయ కార్యదర్శి వినయ్ విశ్వం

విశాలాంధ్ర-తుళ్లూరు: అమరావతి రాజధాని కోసం రైతులు చేస్తున్న పోరాటానికి సీపీఐ అండగా ఉంటుందని సీపీఐ జాతీయ కార్యదర్శి. ఎంపీ వినయ్ విశ్వం చెప్పారు. సీపీఐ ప్రతినిధుల బృందంతో వినయ్ విశ్వం బుధవారం రాజధానిలో పర్యటించారు. గుంటూరు జిల్లా మందడం గ్రామంలోని బుద్ధుడు, న్యాయదేవత విగ్రహాలకి పూలమాలలు వేశారు. సచివాలయం, విట్ యూనివర్సిటీ, గెజిటెడ్ ఆఫీసర్స్, ఎన్జీవో, నాలుగో తరగతి ఉద్యోగస్తులకు నిర్మించిన భవనాలను, హైకోర్టును పరిశీలించారు. అనంతరం తుళ్లూరులో జరిగిన అమరావతి దీక్షలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. రాజధాని కోసం రైతులు చేస్తున్న ఉద్యమం చారిత్రకమన్నారు. మహిళల్లో ఉద్యమస్ఫూర్తి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ స్ఫూర్తి కడవరకు కొనసాగాలని ఆకాంక్షించారు. మహమ్మద్ బీన్ తుగ్లక్ సైతం ఎంతోకొంత గొప్ప పాలన అందించారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధునిక తుగ్లక్ పాలన కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడా మూడు రాజధానులు లేవని, ఆంధ్రప్రదేశ్‌కు మూడు రాజధానులు అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ప్రజల అభిప్రాయాలను, న్యాయస్థానాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని పాలన కొనసాగించాలని హితవు పలికారు. రాజధాని విషయంలో న్యాయస్థానాలు అక్షింతలు వేసినా పట్టించుకోకపోవడం ఏమిటని నిలదీశారు. రైతులు చేసిన అనేక ఉద్యమాలు విజయం సాధించాయని చెబుతూ.. ఢిల్లీలో రైతులు చేసిన ఉద్యమాలను గుర్తుచేశారు. రాజధాని కోసం అన్ని పార్టీలు

ఏకతాటిపైకి రావాలని విజ్ఞప్తి చేశారు. అవకాశం వచ్చినప్పుడు రాజధాని విషయాన్ని రాజ్యసభలో ప్రస్తావిస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డికి శాడిజం పెరిగిందని, తిట్టడానికి సైతం నోరు రావడం లేదన్నారు. జులై 4న ప్రధాని మోదీ ఇక్కడకు వస్తున్నారని, మోదీని కలవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రాజధానిని అభివృద్ధి చేయాలంటే రూ.లక్ష కోట్లు అవసరమని ముఖ్యమంత్రి చెబుతున్నారని, సకాలంలో కాంట్రాక్టుదారులకు బిల్లులు చెల్లిస్తే పనులు చేయడానికి ఎందుకు ముందుకు రారని ప్రశ్నించారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రైతులు 33 వేల ఎకరాలను రాజధాని నిర్మాణానికి ఇచ్చారని, రూ.10 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం తగదన్నారు. ఈ మూడేళ్లలో రాయలసీమలో చిన్న కాలువ అయినా తవ్వావా అని నిలదీశారు. దేశంలో సుదీర్ఘ పోరాటంగా అమరావతి ఉద్యమం కొనసాగుతోందన్నారు. అమరావతి రాజధానిని సాధించేవరకు సీపీఐ పోరు కొనసాగిస్తోందని చెప్పారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పచ్చల సాంబశివరావు, తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, ఏఐటీయూసీ రాజధాని ప్రాంత కార్యదర్శి జీవీ రాజు, గుర్రంకొండ సత్యానందం, పార్టీ నాయకులు కంచర్ల కాశయ్య, చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాన్‌బాబు, అమరావతి జేఏసీ నాయకులు పువ్వాడ సుధాకర్, జి.స్వరాజ్యరావు, ధనేకుల రామారావు, ఆకుల ఉమామహేశ్వరరావు, జమ్మల శ్యామ్‌కిషోర్, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

పేదల సమస్యలపై దళిత జేఏసీ వినతిపత్రం

రాజధానిలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని దళిత జేఏసీ నాయకులు గడ్డం మార్టిన్, సువర్ణకుమారి రాజ్యసభ సభ్యులు వినయ్ విశ్వంకు వినతిపత్రం అందజేశారు. రాజధాని పర్యటనకు విచ్చేసిన వినయ్ విశ్వంను మర్యాదపూర్వకంగా వారు కలిశారు. రాజధానిలో అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు కౌలు పరిహారం అందజేయాలని కోరారు. ప్రతి నెల ప్రభుత్వం ఇచ్చే రూ.2500 నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, త్వరితగతిన నగదు అందజేసి పేదలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ విగ్రహాన్ని శాఖమూరులోనే నిర్మించాలని కోరారు. రాజధానిలో అభివృద్ధి పనులు ప్రారంభించాలన్నారు.

పేదల పక్షపాతి విశాలాంధ్ర

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మనువాద భావజాలాన్ని అడ్డుకునేందుకు దేశ ప్రయోజనాల కోసం విశాల దృక్పథంతో సీపీఐ సహా 17 పార్టీలు కృషిచేయాలని నిర్ణయించినట్లు వివరించారు. ప్రజలను మరింత చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత విశాలాంధ్ర వంటి కమ్యూనిస్టు పత్రికలపై ఉందన్నారు. తద్వారా నవసమాజ నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

విశాలాంధ్ర ఓ సంస్కర్త: ఏటుకూరి

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మాజీ ఎడిటర్ ఏటుకూరి ప్రసాద్ మాట్లాడుతూ విశాలాంధ్ర దినపత్రికను ఓ సంస్కర్తగా అభివర్ణించారు. అన్ని రంగాల్లో ఉన్న చెడును చూపించి, దానిని తొలగించడం ద్వారా సమాజానికి ఏ విధంగా మంచి చేయాలో చూపించడం విశాలాంధ్ర ప్రత్యేకతని తెలిపారు. విశాలాంధ్ర ఏర్పాటు చేయాలని నిర్ణయించినప్పటి నుంచే పత్రిక కోసం పని చేశానని గుర్తుచేశారు. అనేక మంది ప్రముఖులు తమ ఆస్తులను త్యాగం చేసి ఈ పత్రికను స్థాపించారని చెప్పారు. ప్రజల నాడి పట్టుకుని పత్రికను నడిపించారని, ప్రారంభం నుంచి ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీకగా విశాలాంధ్ర నిలిచిందని పేర్కొన్నారు. గతంలో మద్రాస్ నుంచి అన్ని పత్రికలు వచ్చేవని, విశాలాంధ్ర మాత్రం విజయవాడ నుంచి ప్రచురితమయ్యేదని, అందువల్ల ఏ రోజు పత్రిక ఆరోజే అందుబాటులో ఉండేదని తెలిపారు. తాము గుంటూరులో 'విశాలాంధ్ర రేపటి పత్రిక-ఈరోజే' అని చెబుతూ పంపిణీ చేసేవారమని నాటి పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. అన్ని వర్గాల ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యం కోసం విశేష కృషి చేసిందన్నారు. వందలాది మంది పాత్రికేయులు, రచయితలను విశాలాంధ్ర సృష్టించిందని తెలిపారు. సమాజానికి చేటుచేసేవారి భావజాలాన్ని అడ్డుకోవడం, అభ్యుదయ, వామపక్ష భావజాలాన్ని, శాస్త్ర, సాంకేతిక ప్రగతిని ప్రజలకు తెలియజేయడం ఈ పత్రిక లక్ష్యమని పేర్కొన్నారు. విశాలాంధ్ర మరోసారి తన మూలాల్లోకి వెళ్లి

సరైన దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు.

విశాలాంధ్ర ఎవరికీ బెదరదు: రామకృష్ణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ విశాలాంధ్ర పత్రిక వ్యవస్థాపకులు రాష్ట్రంలోనే నాడు ప్రముఖులని, ఆ మహనీయుల కృషి, అంకితభావం వల్లే నేటికీ కొనసాగుతోందని చెప్పారు. మీడియాను కార్పొరేట్లు శాసిస్తున్నారని, అన్ని భాషల్లోనూ మీడియా సంస్థలను తమ చెప్పు చేతల్లో పెట్టుకుని ఇష్టానుసారం ఆడిస్తున్నారని విమర్శించారు. కష్టజీవులు, ప్రజల కోసం నిలిచే పత్రికలు, చానళ్ల అవసరం ఉందన్నారు. బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అసలు సిసలు ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేస్తోందన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దేశం అత్యంత ప్రమాదంలో ఉందని, 2024లో బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని సైతం మార్చివేస్తారని తెలిపారు. జగన్ ప్రభుత్వం పక్షపాతంతో వ్యవహరిస్తూ విశాలాంధ్రకు ప్రకటనలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం అంటే సీఎం జగన్ సొంత ఆస్తి కాదని, 70 ఏళ్ల చరిత్రలో ఎంతోమంది ముఖ్యమంత్రులు వచ్చారు..వెళ్లారని, ఎవరూ శాశ్వతం కాదన్నారు. 70ఏళ్లుగా విశాలాంధ్ర నిరంతరాయంగా కొనసాగుతూనే ఉందన్నారు. తెలుగునాట సామాజిక చైతన్యం, సాంస్కృతిక పునర్జీవానికి విశాలాంధ్ర అందించిన సేవల గురించి ఏమాత్రం తెలియని ముఖ్యమంత్రి..తనకు వ్యతిరేకంగా ఎవరు ఉన్నా అణచివేస్తామనే ధోరణిలో ఆర్థికంగా దెబ్బతీయాలని ప్రయత్నించడం మంచి పద్ధతి కాదన్నారు. ఎవరి బెదిరింపులకు విశాలాంధ్ర అదరదు, బెదరదని స్పష్టంచేశారు. ఎన్ని కష్టాలు వచ్చినా పత్రికను కాపాడుకుంటామని చెప్పారు. విశాలాంధ్రను కాపాడుకునేందుకు లౌకికవాదులు ముందుకు రావాలని కోరారు.

పెద్దల లక్ష్యానికి అనుగుణంగా నడిపిస్తాం: జల్లి విల్సన్

విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ విశాలాంధ్రను ఏ లక్ష్యం కోసమైతే పెద్దలు స్థాపించారో, దానికి అనుగుణంగా నడిపిస్తామని చెప్పారు. అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధి కోసం విశాలాంధ్ర పాటుపడుతోందని తెలిపారు. విశాలాంధ్రతో తనకు చిన్నప్పటి నుంచి ప్రత్యేక అనుబంధం ఉందని, స్వర్ణోత్సవాలు, 60, 70వ వార్షికోత్సవంలో భాగస్వామిగా ఉండటం ఆనందంగా ఉందన్నారు. తనకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నామని విశాలాంధ్రపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష కట్టి ప్రకటనలు ఇవ్వకుండా ఆర్థికంగా ఇబ్బంది పెడుతోందని చెప్పారు. అయినా పెద్దల స్ఫూర్తి, ఉద్యోగుల సహకారం, వామపక్ష ఉద్యమ శ్రేయోభిలాషుల సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. కరోనా సంక్షోభ సమయంలో అనేక సమస్యలు వచ్చినా సమయస్ఫూర్తితో వ్యవహరించి ఒక్క రోజు కూడా పత్రిక ఆగకుండా నడిపామని పేర్కొన్నారు.

ఉద్యోగులను కుటుంబ సభ్యులుగా భావించాలి: గద్దం కోటేశ్వరరావు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ గద్దం కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం కల్పించడం, హేతుబద్ధతతో కూడిన ఆలోచనలు పెంపొందించడం, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మార్పులను ప్రజలకు తెలియజేయడమే లక్ష్యంగా విశాలాంధ్ర పత్రికను స్థాపించారని తెలిపారు. విశాలాంధ్రలో అతి తక్కువ వేతనాలు తీసుకుని పూర్తిస్థాయి కార్యకర్తలుగా పని చేశారని గుర్తుచేశారు. విశాలాంధ్రలో పని చేసేవారిని ఉద్యోగులుగా కాకుండా కుటుంబ సభ్యులుగా భావించి అందరినీ కలుపుకొని వెళ్లాలని సూచించారు.

70 ఏళ్ల చరిత్ర విశాలాంధ్ర సొంతం: ఆర్వీ రామారావ్

విశాలాంధ్ర ఎడిటర్ ఆర్వీ రామారావ్ మాట్లాడుతూ తెలుగులో దినపత్రికలు చాలా వచ్చినా 70 ఏళ్ల చరిత్ర ఏ ఒక్కదానికి లేదని చెప్పారు. తెలుగు నేలపై పుట్టిన విశాలాంధ్ర అనేకమంది పాత్రికేయులు, ఎడిటర్లను సృష్టించిందని తెలిపారు. ప్రజల పక్షపాతిగా, నిరాపేక్షగా ఉండటం విశాలాంధ్ర ప్రత్యేకతని పేర్కొన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి కోశాధికారి జి.ఓబులేశు, సభ్యులు పి.దుర్గాభవానీ, పీవీ మల్లికార్జునరావు, డీజీఎం టి.మనోహర్‌నాయుడు పాల్గొనగా, విశాలాంధ్ర జీఎం పి.హరినాథరెడ్డి స్వాగతం పలికారు. ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు వందన సమర్పణ చేశారు. విశాలాంధ్ర ప్రత్యేక సంచికను వినయ్ విశ్వం ఆవిష్కరించారు.

ప్రముఖులకు సన్మానం

విశాలాంధ్ర మాజీ జనరల్ మేనేజర్ వై.చెంచయ్య, మాజీ అసిస్టెంట్ ఎడిటర్ ఎస్కే బాబును ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, పి.హరినాథరెడ్డి, గద్దం కోటేశ్వరరావు సన్మానించి జ్ఞాపికలు అందించారు. అనంతరం విజ్ఞాన సమితి బాధ్యులను కూడా నాయకులు సన్మానించారు.

గిరిజనులపై మోదీ మొసలి కన్నీరు

మీట్ ద ప్రెస్‌లో పార్లమెంట్‌లో సీపీఐ పక్షనేత వినయ్ విశ్వం

మాట్లాడుతున్న వినయ్ విశ్వం. పక్కన చావా రవి, షేక్ బాబు, నిమ్మరాజు చలపతిరావు, వసంత్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గిరిజనులపై మోదీ సర్కారు మొసలి కన్నీరు కారుస్తోందని పార్లమెంట్‌లో సీపీఐ పక్షనేత వినయ్ విశ్వం విమర్శించారు. ఏనాడూ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించని ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న మోదీ ప్రభుత్వం రాష్ట్రపతి అభ్యర్థిగా గిరిజన మహిళను ప్రకటించి..గొప్పగా ప్రచారం చేసుకుంటుందని చెప్పారు. విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్వర్యాన బుధవారం ఉదయం నిర్వహించిన మీట్ ద ప్రెస్‌లో వినయ్ విశ్వం మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వే షన్ కల్పించే చట్టం తీసుకురావడంలో నిర్లక్ష్యం వహిస్తూ మహిళా సాధికారత గురించి మాట్లాడటం అర్థం లేనిద న్నారు. గిరిజన మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించి, గిరిజనులకేదో మేలు చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. ఒకపక్క గిరిజన హక్కులను కాలరాస్తూ, మరోపక్క గిరిజనులపై సవతి తల్లి ప్రేమ నటించడం బీజేపీ నిజ స్వరూపాన్ని తేటతెల్లం చేస్తుందన్నారు. నీరు, భూమి, అడవి (జల్, జమీన్, జంగిల్) కోసం గిరిజనులు సుదీర్ఘకాలం నుంచి పోరాడు తున్నప్పటికీ వారి సమస్యలను, సంక్షేమాన్ని మోదీ ప్రభుత్వం ఏనాడూ పట్టించుకున్న దాఖలాల్లేవని వినయ్ విశ్వం విమర్శించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హాను పోటీ చేయించాలని 17 ప్రతి పక్ష పార్టీలు ఏకగ్రీవంగా నిర్ణయించడం కీలక పరిణా మమని పేర్కొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాల ఐక్యతకు ఇదొక భూమిక కానుందన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్య స్తంగా, అధ్వానంగా తయారైందన్నారు. ఈ ప్రభావం అన్ని రాష్ట్రాలపై పడిందన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరి స్తున్న విధానాలకు, ఆనాటి హిట్లర్ పాలనకు సారూప్యత ఉందని విమర్శించారు. అగ్నిపథం పథకంపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ దీనిపై కేంద్ర ప్రభుత్వం రక్షణ శాఖలో సవివరమైన చర్చ జరపకుండా ఏకపక్షంగా అనాలోచిత నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. గతంలోనూ మోదీ తీసుకున్న పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ, రైతులకు సంబంధించిన మూడు నల్లచట్టాలు సరైనవేనని కేంద్రం సమర్థించుకున్నదని, కానీ ప్రజలు మాత్రం తప్పు అని గట్టిగా చెప్పారని, ఆచరణలో అదే రుజువైందన్నారు. మూడు సాగు చట్టాలను రద్దు చేస్తూ మోదీ క్షమాపణలు చెప్పారని గుర్తు చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ అధ్యక్షులు చావా రవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు షేక్ బాబు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఆర్.వసంత్ పాల్గొన్నారు. అనంతరం పార్లమెంటు సభ్యులు వినయ్ విశ్వంను ప్రెస్‌క్లబ్ నిర్వాహకులు శాలువా, మెమెంటోతో సత్కరించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రిన్సిపల్ సెక్రటరీ అనూరాధకు వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనూరాధకు, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సిరికి యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ, రాష్ట్ర నేతలు సుగుణమ్మ, హెల్డా, సరోజ, ప్రభావతి, నాగేశ్వరి, శోభ విజయ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ తరహాలో జీతాలు ఇవ్వాలని, గ్రేడ్ 2 పదోన్నతులు కల్పించాలని, షరతులు లేకుండా అందరికీ నవరత్నాలు వర్తింప చేయాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణకు మెనూ ధరలు పెంచాలని, గ్యాస్, వంట పాత్రలు ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, అంతవరకూ వీరికి కూడా మెయిన్ టీచర్లకు మాదిరిగా జీతం ఇవ్వాలని, పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, పదవీ విరమణ మొత్తం రూ.5 లక్షలు ఇవ్వాలని, 4వేలు పెన్షన్ ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు అమలు చేసి గ్రాట్యుటీ ఇవ్వాలని కోరారు. గొల్లపూడిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం డి.ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన అసోసియేషన్ రాష్ట్ర సమితి సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి. ఓబులేశు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా జులై 1న సీడీపీఓలకు, జులై 4న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలు చేసి వినతిపత్రాలు ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది.

మారుతీ ప్రియను అభినందిస్తున్న ఎవి రమణారెడ్డి

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీ సరస్వతి' ప్రభంజనం

- 980 పైబడి మార్కులను దక్కించుకున్న 11 మంది విద్యార్థులు
- ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 466/470 సాధించిన మారుతీ ప్రియ

విశాలాంధ్ర-ఒంగోలు: ఇంటర్ పరీక్షా ఫలితాలలో స్థానిక శ్రీ సరస్వతి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో మెరిశారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో డి మారుతీ ప్రియ 466/470 మార్కులతో ప్రభంజనం సృష్టించింది. 465 మార్కులతో షేక్ అఖిల, కె.అనుష్‌కుమార్ రాయ్ ద్వితీయ స్థానంలో నిలుచారు. 464 మార్కులను 9 మంది విద్యార్థులు సాధించగా, 463 మార్కులను ఆరుగురు, 460కిపైగా మార్కులను 42 మంది సాధించారు. బైపీసీ విభాగంలో 431 మార్కులను ఇద్దరు విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో మారం మేఘన 987/1000 మార్కులతో ప్రథమ స్థానంలో నిలువగా, ఎం.కవిత 985 మార్కులతో ద్వితీయ స్థానం, ఎస్. వైష్ణవి 984 మార్కులు సాధించారు. 980 పైగా మార్కులను 11 మంది విద్యార్థులు దక్కించుకున్నారు. అత్యధిక మార్కు లను సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల ఛైర్మన్ ఆవుల వెంకట రమణారెడ్డి, డైరెక్టర్లు నగేష్‌రెడ్డి, గంగా శంకరరెడ్డి, సీఈవో సురేష్, డీన్, ప్రిన్సిపాల్, ఏవోలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

'విశాఖ ఉక్కు' అమ్మే హక్కు కేంద్రానికి లేదు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ
- 26న విశాఖలో మహాప్రదర్శన

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సంపదని, ఈ సంపదను అమ్మే హక్కు కేంద్ర ప్రభుత్వానికి లేదని విశాఖ ఉక్కు పరి రక్షణ పోరాట కమిటీ స్పష్టం చేసింది. ఉక్కునగరం లోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో పోరాట కమిటీ చైర్మన్‌లు డి.ఆదినారా యణ, మంత్రి రాజశేఖర్, కన్వీనర్ జె.అయోధ్య రామ్, వై.మస్తానప్ప మాట్లాడారు. కేంద్రప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని 100 శాతం విక్రయించాలని గత ఏడాది జనవరిలో నిర్ణయిం చిందని, ఆనాటి నుంచి నేటి వరకు కూర్మన్నపాలెం కూడలిలో రిలే దీక్షలు చేపడుతున్నామని అన్నారు. ఈనెల 26 తేదీకి 500 రోజులు పూర్తవుతున్న సందర్భంగా కూర్మన్నపాలెం కూడలి నుంచి విశాఖ నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు మహా ప్రదర్శన నిర్వహించి కేంద్రానికి హెచ్చరిక చేస్తామన్నారు. వేలాది మందితో ఈ ప్రదర్శనను నిర్వహిస్తామని చెప్పారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు, యువకులు, కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఎన్నో పోరాటాలు, ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన ఈ కర్మాగారాన్ని కాపాడుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఉన్న ఏకైక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించే వరకు పోరాటం ఆపేది లేదని పేర్కొన్నారు. కె.ఎస్.ఎన్.రావు అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, డొక్కా నర్సింగరావు, కె.రాజబాబు, వై.టి.దాస్, రామస్వామి, విల్లా రామ్మోహన్‌కుమార్, బొడ్డు పైడిరాజు, వరసాల శ్రీనివాసరావు, బి.డేవిడ్, డి.సురేష్ బాబు, పి.ఉగ్రమ్, జగదీష్, మహాలక్ష్మి నాయుడు, జి.ఆర్.కె నాయుడు, సీహెచ్ సన్యాసిరావు, నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహా ప్రదర్శన జయప్రదానికి ప్రచారం

ఈనెల 26న విశాఖ డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు నిర్వహించే మహాకార్మికప్రదర్శన, బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరుతూ ఉక్కు కర్మాగారంలోని ప్రధాన విభాగాలలో ఉక్కు అఖిలపక్షం పోరాట కమిటీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పరిశ్రమను కాపాడుకొనే బాధ్యత అందరి మీద ఉందని గుర్తు చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. బుధవారం కోకోవెన్ విభాగం కార్మికులకు మహా ప్రదర్శన జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు జ్యోతి ప్రసాద్, యెల్లేటి శ్రీనివాసరావు, తాండ్ర కనకరాజు, బబ్బురి సూర్య,సాంబశివ, రామచంద్రరాజు, ఆనంద్ కుమార్, టీవీకే రాజు, మొహిద్దీన్ సుబ్బారావు, కొమ్ము ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆయాలకు 3 నెలల జీతం వెంటనే ఇవ్వాలి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు (స్వీపర్లు)గా పనిచేస్తున్న వారికి మూడు నెలలనుంచి జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారికి వెంటనే జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ప్రభుత్వ పాఠశాలల ఆయాల సంఘం డిమాండ్ చేసింది. బుధవారం విజయవాడలోని రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం, ఆయాల స్కీమ్ డైరెక్టర్ దివాన్ మైదీన్‌ను ఆయాల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.త్యాగరాజు, ఉపాధ్యక్షులు కె.బుచ్చిబాబు,చాట్ల పుల్లారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.లక్ష్మి, షేక్ నాగుల్ మీరా తదితరులు కలిశారు. ఆయాలకు మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన జీతాలు ఇంత వరకు అందలేదని తెలిపారు. రెక్కాడితే డొక్కాడని కుటుంబాలు కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. వీరు మరుగుదొడ్లు, స్కూల్ ఆవరణ శుభ్రం చేస్తుంటారని వివరించారు. వీరికి 2019, 2020 సంవత్సరం జీతాలు రాలేదని, వీరి జీతాల కోసం విద్యార్థులకు ఇస్తున్న అమ్మఒడి పథకం నుండి ఒక్కొక్కరి వద్ద నుండి రూ.1000/- వసూలు చేశారని, వాటిని ఆయాలకు ఇవ్వలేదని చెప్పారు. ఆయాలకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

నీరు-చెట్టు బకాయిలు చెల్లించండి

చంద్రబాబు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి నిర్వా కంతో గత మూడేళ్లుగా నీరు-చెట్టు బిల్లులు పెండిం గ్‌లో పెట్టడం వల్ల అనేకమంది ఆత్మహత్య చేసుకున్నారనీ, వందలాది మంది అప్పుల ఊబిలో కూరుకు పోయారనీ తక్షణమే వారికి చెల్లింపులు చేపట్టాలని టీడీపీ అధినేత చంద్రబాబు డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం చంద్రబాబుకు నీరు-చెట్టు ఫిర్యాదుల విభాగం బాధ్యులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు పెండింగ్ బిల్లుల పురోగతిని నివేదించారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ, రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. నిధుల విడుదలకు జీ.వో లు మాత్రమే ఇచ్చి రైతుల ఖాతాలకు నగదు జమ చేయకపోవడం దారుణమన్నారు. బాధితులకు ఆఖరి రూపాయి అందే వరకు కృషి చేయాలని బాధ్యులకు ఆదేశాలు జారీ చేశారు.హైకోర్టు ఆదేశాలను అమలు చేయకపోతే అవసరమైతే ధిక్కార పిటిషన్లు వేసి పనులు చేసిన రైతులకు అండగా ఉండాలని ఫిర్యాదుల విభాగానికి సూచన చేశారు. నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు చెల్లించాలని 2237మంది హైకోర్టును ఆశ్రయించగా, ఆరువారాల్లో పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోర్టు ఆదేశాలిచ్చినా అమలు చేయకపోవడంతో సుమారు 280 మంది ధిక్కార పిటిషన్లు వేశారని చంద్రబాబుకు ఈ సందర్భంగా ఆళ్ళ వివరించారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న ధిక్కార పిటిషన్లు, ఇంటర్మ్ ఆర్డర్స్‌కు సంబంధించి రూ.200 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చిందని తెలిపారు. జీవోలు మాత్రమే ఇచ్చి నగదు చెల్లించ కుండా ట్రెజరీ అధికారులు మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారుల మధ్య సమన్వయం లేక రెండు వారాలుగా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మెమోల పేరుతో కక్షపూరిత ధోరణి విడనాడి గతంలో నరేగా బిల్లులు చెల్లించిన విధంగా నీరు-చెట్టు బిల్లులు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు జరుగుల పుల్లయ్య (కర్నూలు) కపులూరి రాజా చంద్రమౌళి (కృష్ణ) తదితరులు పాల్గొన్నారు.

అమ్మఒడికి లక్ష మంది దూరం

27న పథకం నిధుల విడుదల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఈసారి అమ్మఒడి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ కోత విధిస్తోంది. హాజరు శాతం, కరెంట్ బిల్లులు తదితర నిబంధనలతో గతం కంటే దాదాపు లక్ష మంది లబ్ధిదారులు తగ్గనున్నారు. అమ్మఒడి పథకంలో భాగంగా ఈనెల 27వ తేదీన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమ చేయనున్నట్లు విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం ఇంటర్ ఫలితాల విడుదల సందర్భంగా ప్రకటించారు. లబ్ధిదారుల ఖాతాల్లో రూ.13వేల చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. అమ్మఒడి కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.6,500 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అయితే పాఠశాలలకు గైర్హాజరయ్యారన్న కారణంతో 51వేల మందిని ప్రభుత్వం అనర్హులుగా గుర్తించగా, వేర్వేరు కారణాలతో మరో 50వేల మందికి అమ్మఒడిని నిలిపివేయనున్నారు.

విద్యుత్ వాడకం నెలకు 300 యూనిట్లు దాటితే అమ్మఒడి పథకం ప్రయోజనం అందదు. నవంబరు 8 నుంచి ఏప్రిల్ 30 వరకు విద్యార్థి హాజరు 75శాతం లేకపోయినా అమ్మఒడి ప్రయోజనం పొందలేరు. బియ్యం కార్డు కొత్తది ఉండాలి. కొత్త జిల్లాల నేపథ్యంలో ఆధార్‌లో జిల్లా పేరును మార్చుకోవాలి. బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ చేసుకోవడం, బ్యాంకు ఖాతాలు మనుగడ ఉన్నాయో లేవో విద్యార్థుల తల్లిదండ్రులు తనిఖీ చేసుకోవాలని ఇటీవల పాఠశాల విద్యాశాఖ ఉత్వర్వులిచ్చిన విషయం తెలిసిందే. ఈ నిబంధనల ప్రకారం ఈనెల 27వ తేదీ అమ్మఒడి పథకం కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు పెద్ద సంఖ్యలో నిరాశ కలగనుంది.

45శాతం వేతనం పెంచాల్సిందే

- సినీ కార్మికుల ధర్నా
- అగ్రిమెంట్ కాలపరిమితి ముగిసినా జీతాలు పెంచని వైనం
- ప్రేక్షక పాత్ర వహిస్తున్న ఫిలిం చాంబర్?

విశాలాంధ్ర-జూబ్లీ హిల్స్: తెలుగు సినీ కార్మికుల రోజు వారి వేతనాలు పెంచాలని ఫిలిం ఫెడరేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. వేజ్ అగ్రి మెంట్ కాలపరిమితి ముగిసినా, నిర్మాతల మండలి జీతా లు పెంచడం లేదని, మధ్యవర్తిత్వం చేయా ల్సిన ఫిలిం చాంబర్ నిర్మాతల మండలి వైపు ఉంటున్నట్టు పలువురు ఆరోపణలు చేశారు. జీతాలు పెంచితేనే గురువారం నుంచి షూటింగ్‌లకు వెళ్తామని కార్మిక సంఘాలు చెప్పాయి. గురువారం షూటింగ్‌కు వెళ్తేనే ఆలోచిస్తామని నిర్మాతల మండలి పేర్కొంది. ఇద్దరు మెట్టు దిగకపోవడం సమస్యగా పరిణమించింది. ఇప్పటివరకు పలుమార్లు ఫిలిం చాంబర్‌కి లెటర్స్ ఇచ్చినప్పటికీ చర్చలకు పిలవలేదని, చివరగా ఈనెల 6న మరో లేఖ ఇచ్చినప్పటికి స్పందించక పోవడంతో సినీ కార్మికులు కదంతొక్కారు. 24 అనుబంధ సంఘాలకు మాతృ సంస్థ అయిన తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఎన్ దొర సంయుక్తంగా ప్రకటించారు. 24 అనుబంధ సంఘాల కార్మికులకు తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్త కో ఆర్డినేషన్ కమిటీ ద్వారా ప్రతి 3 సంవత్సరాలకు జీతాల ఒప్పందం జరగడం ఆనవాయితీగా వస్తోం దని, ఈ కాలపరిమితి 2021తో ముగిసిందని, 14 నెలలు కావస్తున్నా దీనిపై ఎవరూ మాట్లాడక పోవడం దారుణమన్నారు. ప్రస్తుతం సినీ కార్మికుల దైనందిన జీవితాలు విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల వలన, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా విపరీతంగా పెరిగిపోయి వారి కుటుంబజీవన విధానం క్లిష్టంగా మారిన పరిస్థితుల్లో ఫెడరేషన్ నాయకులకు పరిస్థితిని విన్నవించామన్నారు. చివరి ప్రయత్నంగా ఫిలిం చాంబర్‌కు 15 రోజుల లోపల 24 అనుబంధాల సంఘాల వేజ్ అగ్రిమెంట్ పూర్తి చేయలని, లేని పక్షంలో తదుపరి 24 అనుబంధాల సంఘాల నాయకుల అభిప్రాయాలను గౌరవించి వారు తీసుకొనే నిర్ణయానికి ఫిలిం ఫెడరేషన్ నాయకులు కట్టుబడి ఉంటామని వారు మాట ఇచ్చామన్నారు ఇదే విషయాన్నీ ఫిలిం చాంబర్ వారికీ లిఖిత పూర్వకంగా తెలియజేశామని, కానీ వారి నుంచి ఎటువంటి సమాధానం రాకపోగా, ఏవో కారణాలు చెబుతూ ఎప్పటిలాగే కాలయాపన చేస్తున్నారని ఆవేదన చెందారు. ఈ పరిణామాల మధ్య 24 అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు ఎవరుకూడా ఏ విధమైన షూటింగ్‌లకు వెళ్లకుండా అందరూ కూడా ఫిలిం ఫెడరేషన్ దగ్గరకు వచ్చి వారి బాధలను, ఆవేదనను వ్యక్తం చేశామని, బుధవారం ఫిలిం ఫెడరేషన్ దగ్గర తీసుకున్న నిర్ణయం ప్రకారం గురువారం నుంచి ఏ నిర్మాతైతే 45శాతం ఇస్తారో ఆ షూటింగ్‌లకు మాత్రమే వెళ్లాలని నిర్ణయించినట్టు వివరించారు.

పాలిటెక్నిక్ అధ్యాపకుల వేతన స్కేళ్ళకు సీఎం అనుమతి: కత్తి నర్సింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో 84 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న 1600 మందికి పైగా అధ్యాపకులకు కేంద్ర ప్రభుత్వ 7వ వేతన సవరణ సిఫార్సుల ప్రకారం ఏఐసీటీఈ వేతన స్కేళ్ళు-2016 వర్తింపు దస్త్రాన్ని సీఎం జగన్ ఆమోదించారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత శాసనమండలి సమావేశాల్లో తన ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక హామీ మేరకు వేతన స్కేళ్ళ దస్త్రాన్ని ఆమోదించడంతో ముఖ్యమంత్రికి, ఆర్థిక మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గ్రీన్ ఎనర్జీతో రైతుకెంతో మేలు

- రాష్ట్రంలో 30వేల మెగావాట్ల ఉత్పత్తికి అవకాశాలు
- ఇందుకోసం 90వేల ఎకరాల భూమి అవసరం
- ఎకరాకు రూ.30వేలు రానున్న లీజు
- సుబాబుల్, జామాయిల్ రైతులకు మంచి అవకాశం
- ఎస్ఐపీబీ సమీక్షలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో సుమారు 30వేల మెగావాట్లకు పైగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి అపార అవకాశాలు ఉన్నాయని, దీనివల్ల రైతులకు, రాష్ట్రానికి పెద్ద మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. ఇందుకోసం దాదాపు 90వేల ఎకరాల భూమి అవసరం అవుతుందన్నారు. ప్రతి ఎకరాకు రైతుకు కనీసంగా రూ.30వేల లీజు వస్తుందని, ఈ ఆదాయం ప్రతి ఏటా అన్నదాతకు నేరుగా వస్తుందన్నారు. సీఎం జగన్ అధ్యక్షతన బుధవారం క్యాంప్ కార్యాలయంలో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశం జరిగింది. ఈసమావేశంలో వివిధ ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ సంద ర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి వల్ల వర్షాభావ ప్రాంతాల్లో రైతుకు స్థిర ఆదాయం లభించి ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల దావోస్‌లో కుదుర్చుకున్న ఎంఓ యూలు, మిగతా ప్రాజెక్టులు కూడా వీలైనంత త్వరగా సాకార మయ్యేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కంపెనీల తయారీ కేంద్రంగా రాష్ట్రం మారాలని, ఇందుకోసం గ్లోబల్ కంపెనీల పెట్టుబడులు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఎలక్ట్రానిక్స్, పర్యాటక ఆతిథ్య రంగాల్లో మంచి పెట్టుబడులకు రాష్ట్రంలో పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకో వాలన్నారు. కొప్పర్తిలో ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమలు విరివిగా వస్తున్నాయని, మరిన్ని గ్లోబల్ కంపెనీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరిశ్రమలకు అవసరమైన సామగ్రిని, అలాగే ఉత్పత్తులను సులభంగా తరలించేం దుకు వీలుగా కొప్పర్తిలో రైల్వే లైన్ ఏర్పాటుచేయాలని సీఎం ఆదేశించారు. అదానీ గ్రీన్ ఎనర్జీ చేపట్టనున్న 3700 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు ఎస్ఐపీబీ ఈ సమావేశం ఆమోదం తెలిపింది. దీనివల్ల మొత్తంగా రూ.15,376 కోట్ల పెట్టుబడులు రానుండగా, సుమారు 4వేలమందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేసింది. వైఎస్సార్ జిల్లాలో వేయి మెగావాట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుకుట్టి వద్ద 1200 మెగావాట్లు, కర్రివలస వద్ద వేయి మెగావాట్లు, సత్యసాయి జిల్లాలోని పెద్దకోట్ల చిత్రవతి వద్ద 500 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి జరుగనున్నట్లు అధికారులు వివరించారు. కృష్ణాజిల్లా మల్లవెల్లి ఫుడ్‌పార్కులో రూ.150 కోట్లతో అవిసా ఫుడ్స్ ప్రయివేట్‌లిమిటెడ్ పెట్టనున్న రొయ్యల ప్రాసెసింగ్ పరిశ్రమకు, తిరుపతిలో నొవొటెల్ బ్రాండ్‌కింద హోటల్ ఏర్పాటు చేయనున్న వీపీపీఎల్‌కు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి చిరునామాగా మారిన కొప్పర్తిని టెక్స్‌టైల్ రీజియన్ అపెరల్ పార్క్‌గా తీర్చిదిద్దేందుకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. నాణ్యమైన విద్యుత్తు, నీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని, పరిశ్రమలు పెట్టే ఆయా ప్రాంతాలను రైల్వేలైన్లతో అనుసంధానించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్నాథ్, ఆర్కే రోజా, సీఎస్ సమీర్ శర్మ, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అవినీతిలో కేసీఆర్ కుటుంబం

సీబీఐకి కేఏ పాల్ ఫిర్యాదు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్... కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి ఫిర్యాదు చేశారు. కేసీఆర్‌తో పాటు తెలంగాణ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, రాజ్యసభ ఎంపీ సంతోష్, ఎమ్మెల్సీ కవితపై కూడా ఫిర్యాదు చేశారు. వీరంతా కాళేశ్వరం, యాదాద్రి ప్రాజెక్టుల్లో భారీగా అవినీతికి పాల్పడ్డారని అధికారు లకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు పాల్ వెల్లడించారు. ఢిల్లీలోని సీబీఐ కార్యాలయంలో ఈ మేరకు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు కేఏ పాల్ తెలిపారు. 'సీబీఐ అధికారులకు తెలంగాణ సీఎం కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌పై ఫిర్యాదు చేశాం. రాష్ట్రంలో చాలా పెద్ద ప్రాజెక్టయిన కాళేశ్వరంలో అవినీతి జరిగిందని కంప్లైంట్ చేశాం. లక్షా ఐదు వేల కోట్లరూపాయల ప్రాజెక్టులో భారీగా అవినీతి జరిగినట్టు వివరించాం. యాదాద్రి ప్రాజెక్టులోనూ అవకతవకలు జరిగినట్టు చెప్పాం. ఈ ప్రాజెక్టుల్లో వీళ్ల అవినీతి గురించి సుదీర్ఘంగా అధికారులకు వివరించాం. వాళ్లు కూడా ఓపికతో ఆలకిం చారు. ఏవిధంగా విచారణ చేస్తారో అధికారులు వివరించారు. ఇందులో భాగంగా వాళ్లకు ఎలాంటి సహకారం కావాలన్న నావంతు సహకరిస్తా. ఈ విచారణ చాలా ప్రమాదకరమైనది కాబట్టి అధికారులకు ఎలాంటి కీడు జరగకూడదని ప్రార్థన కూడా చేశాం' అని కేఏ పాల్ వివరించారు.

గంజాయి గ్యాంగ్‌పై రౌడీషీట్

ఆదేశించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

విశాలాంధ్ర-శింగరాయకొండ : శింగరాయకొండ మండలం, మూల గుంటపాడు పంచాయతీ వెంకటేశ్వరకాలనీలోని ఎస్సీ కుటుంబాలపై దాడికి పాల్పడిన వ్యక్తులపై రౌడీషీట్ తెరవాలని ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గంజాయి సేవించి విచక్షణా రహితంగా ప్రవర్తించే గ్యాంగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావుతో గ్రామంలో పర్యటించారు. బాధిత కుటుంబాల్ని పరామర్శించారు. బాధితులకు కమిషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇటువంటి చర్యలు మళ్లీ జరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. గంజాయిని నిరోధించే చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. నిందితులపై రౌడీషీట్ తెరచి ఆ వివరాలను కమిషన్ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఈ పర్యటనలో విక్టర్ ప్రసాద్‌తో పాటు డీఎస్పీ నాగరాజు, సీఐ లక్ష్మణ్, శింగరాయకొండ తహశీల్దార్ ఉషారాణి, ఎస్ఐ సంపత్‌కుమార్, దళిత ఉద్యమ నేత నీలంనాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా దాడికి పాల్పడిన యువకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు రాఘవులు కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందించారు. ప్రధాన నిందితుడు సాయి కళ్యాణ్‌రెడ్డి తండ్రి ముప్వా రామిరెడ్డినా అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

సంపాదకీయం

మోదీని నిలవరించే మహదవకాశం

రాష్ట్రపతి ఎన్నికలలో అధికార కూటమి అభ్యర్థి, ఝార్ఖండ్ మాజీ గవర్నర్, 64 ఏళ్ల గిరిజన మహిళ విజయం సాధిస్తుందా లేక ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి మాజీ కేంద్ర మంత్రి యశ్వంత్ సిన్హా గెలుస్తారా అన్న చర్చ ప్రధానం కాదు. అయినా రాష్ట్రపతి ఎన్నిక గత నాలుగు నాలుగున్నర దశాబ్దాలలో ఎన్నడూ లేని ఉత్కంఠ రేపుతోంది. అన్ని వేళలా ఎన్నికల ధ్యాసలోనే ఉండే ప్రధానమంత్రి మోదీ రాష్ట్రపతి ఎన్నికకు అధికార అభ్యర్థిని నిర్ణయించడంలో కూడా భవిష్యత్తు ఎన్నికలనే దృష్టిలో ఉంచుకున్నారు. ద్రౌపది ముర్మును రంగంలోకి దించి మహిళనే కాకుండా గిరిజన అభ్యర్థికి అవకాశం ఇచ్చినట్టు కనిపిస్తున్నా ముందు ముందు జార్ఖండ్, ఛత్తీస్ గఢ్, బిహార్, బెంగాల్‌లో సంథాల్ ఓట్లను దండుకోవాలన్న దృష్టి కూడా మోదీకి లేకపోలేదు. బీజేపీతో పోలిస్తే ప్రతిపక్షమే బలంగా ఉన్నట్టు కనిపిస్తోంది. అధికార పక్షం అభ్యర్థిని గెలిపించుకోవడానికి కొన్ని ఓట్లు తక్కువ పడుతున్నాయి. ఆ లోటు భర్తీ చేయడానికి మోదీ, అమిత్ షా ద్వయం ఎన్ని సాముగరిడీలకైనా పాల్పడగలదు. ముర్ము పేరు ఖరారు చేయడం ద్వారా గిరిజన ఓట్ల మీద ఆధారపడే ప్రతిపక్ష జార్ఖండ్ ముక్తి మోర్చాను ఇరుకున పెట్టడం మోదీ ఉద్దేశం. ముర్ము ఒరిస్సాకు చెందిన వారు కావడం వల్ల బీజేపీతో అంటీ ముట్టనట్టు ఉంటున్న బిజూ జనతా దళ్ (బి.జె.డి.) ను కూడా బుట్టలో వేసినట్టే. ఒరిస్సా మహిళను ఎంపిక చేయడం తమ రాష్ట్రానికి గర్వకారణం అని ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వ్యాఖ్యానించడం వల్ల బిజూ జనతాదళ్ మద్దతు ముర్ముకు ఉన్నట్టే. ఒరిస్సాలో బీజేపీ-బి.జె.డి. కలిసి అధికారంలో ఉన్నప్పుడు ముర్ము ఆ మంత్రివర్గ సభ్యురాలే. 2017 రాష్ట్రపతి ఎన్నికల సమయంలోనూ ముర్ము పేరు ప్రస్తావనకు వచ్చింది. మహారాష్ట్రలో శివసేన, కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి.) సంకీర్ణ ప్రభుత్వాన్ని అస్థిరీకరించడానికి బీజేపీ ప్రయత్నం అక్కడ తక్షణం ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వాన్ని పడదోసి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంకన్నా ఎక్కువగా ప్రతిపక్ష శిబిరంలో ఉన్న శరద్ పవార్ దృష్టి మహారాష్ట్ర నాటకీయ పరిణామాల నుంచి కదలకుండా చేయడమే బీజేపీ ప్రధాన ఎత్తుగడ. బి.ఎస్.పి., బి.జె.డి., వై.ఎస్.ఆర్ కాంగ్రెస్, టి.ఆర్.ఎస్. అధికార పక్షంతో లేకపోయినా ప్రతిపక్షాలతోనూ లేవు. టి.ఆర్.ఎస్. నాయకుడు కె.సి.ఆర్. ఈ మధ్య మోదీని ఘాటుగా విమర్శిస్తున్నారు. ఇటీవల మోదీ రెండు సార్లు హైదరాబాద్ వచ్చినా కె.సి.ఆర్. మోదీని కలుసుకోకుండా జాగ్రత్త పడ్డారు. రాష్ట్రపతి ఎన్నికలలో టి.ఆర్.ఎస్. వైఖరి ఎలా ఉంటుందో గమనించాలి. ప్రతిపక్షాలన్నీ తన నాయకత్వం కింద ఏకం కావాలన్న కె.సి.ఆర్. ఆకాంక్ష నెరవేరేట్టు లేదు కనక ఆయన పార్టీ వైఖరికి ప్రాధాన్యం ఉంది. పలుకుబడి, బీజేపీ నేతలతో సహా వివిధ ప్రతిపక్షాలతో యశ్వంత్ సిన్హాకు ఉన్న సంబంధాలు మోదీ శిబిరానికి కొంత చికాకు కలిగించవచ్చు. యశ్వంత్ సిన్హా ఆషామాషీగా పోటీ చేయడం లేదు. గెలుపు ఓటములు ఆయన మీద అంత ప్రభావం చూపవు. యశ్వంత్ సిన్హా అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలోని ఎన్.డి.ఎ. మంత్రిగా పనిచేసినా, అప్పుడు బీజేపీలో ఉన్నా కరడుగట్టిన హిందుత్వవాది ఏమీ కాదు. బీజేపీ నుంచి బయటపడ్డ తరవాత యశ్వంత్ మోదీని అవకాశం వచ్చినప్పుడల్లా బోనులో నిలబెడుతూనే ఉన్నారు. బీజేపీలో ఉన్నప్పుడైనా సిన్హా సంఘ్ పరివార్‌తో సంబంధం ఉన్న వారు కాదు. ఆయనకు ఆర్.ఎస్.ఎస్.తో లంకె లేదు. బీజేపీలో ఉన్నప్పుడూ ఉదారవాదిగా, మధ్యేమార్గ వాదిగానే ఉండేవారు. రాష్ట్రపతి ఎన్నికలలో ఓటర్ల సంఖ్య కన్నా ఓటు విలువ ముఖ్యమైంది కనక ఉభయ పక్షాలూ ఒక్కో ఓటు కోసం ప్రయత్నించాల్సిందే.

జయాపజయాలు ఎలా ఉన్నా ప్రతిపక్షాల ఐక్యత కోసం జరుగుతున్న ప్రయత్నాలకు యశ్వంత్ సిన్హా అభ్యర్థిత్వం ఊపు ఇచ్చింది. ప్రతిపక్షాల ఐక్యతా యత్నాలు ముందుకు సాగే అవకాశం ఉంది. ప్రతిపక్ష శిబిరంలో ఐక్యత అన్న తపన ఎంత తీవ్రంగా ఉందో ఆ శిబిరానికి నాయకత్వం మీద మమత, కె.సి.ఆర్., అరవింద్ కేజ్రీవాల్ లాంటి వారి ఆశలు అంతకన్నా ఎక్కువగానే ఉన్నాయి. ప్రతిపక్ష ఐక్యత నుంచి కాంగ్రెస్‌ను మినహాయించ డానికి తృణమూల్ నాయకురాలు మమత చేయని ప్రయత్నం లేదు. ఆమె కాంగ్రెస్‌ను అవమానించారు కూడా. అయినా ప్రతిపక్ష అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ ఒక అడుగు వెనక్కు వేసి యశ్వంత్ అభ్యర్థిత్వాన్ని సమర్థిస్తోంది. యశ్వంత్ సోషలిస్టు భావాలు ఉన్న వారు. మాజీ ప్రధాని చంద్ర శేఖర్‌కు సన్నిహితుడు కనక వామపక్షాల మద్దతు కూడా ఆయనకు ఉంటుంది. యశ్వంత్ పోటీ చేయడానికి తృణమూల్ నుంచి రాజీనామా చేయడానికి మమతా బెనర్జీ అంగీకరించడం కూడా సానుకూల పరిణామమే. సిన్హా రాష్ట్రపతి ఎన్నికలలో తన గెలుపు కన్నా ప్రతిపక్షాల ఐక్యత మీదే ఎక్కువ దృష్టి కేంద్రీకరించారు. ప్రతిపక్షాలను ఐక్యం చేయడానికే ఆయన బిహార్ ఎన్నికలలో ఒంటరి పోరాటానికి కూడా వెనుకాడలేదు. బిహార్ ముఖ్య మంత్రి నితీశ్ కుమార్‌ను ఇరుకున పెట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తూనే ఉంది. నితీశ్ కూడా ఉదాసీనంగానే ఉంటున్నారు. కీలక పాత్ర పోషించడానికి ఆయనకు వచ్చినన్ని అవకాశాలు మరెవరికీ రాలేదు. రాష్ట్రపతి ఎన్నికలలో ఆయన వేసే అడుగులకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. మోదీ దృష్టి 2024 ఎన్నికల మీద ఆ లోపు వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల మీద ఎటూ ఉంటుంది. యశ్వంత్ గట్టి పోటీ ఇవ్వడం ఖాయం కనక 2024లో మోదీని సవాలు చేయడానికి ప్రతిపక్షాలకు ఇది మహదవకాశం. అయితే కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందితే తప్ప ప్రతిపక్షాల ఐక్యతలో పస ఉండదు. రాష్ట్రపతి ఎన్నికలలో ప్రతి పక్షాలకు సంఖ్యాపరంగా ఉన్న స్వల్ప ఆధిక్యతను రాజకీయ అవకాశంగా మార్చుకోవడానికి ఒడుపు అవసరం. ప్రతిపక్షాల ఐక్యత కేవలం మోదీ వ్యతి రేకతకు పరిమితమైన అంశం కాదు. కానీ మోదీ హయాంలో అనునిత్యం జరుగుతున్న దురాగతాలను నిలవరించడానికి కేవలం ప్రతిపక్షాల ఐక్యతే సరిపోదూ. నిర్మాణాత్మక కార్యక్రమం, ప్రత్యా మ్నాయ ఆలోచనా ధోరణి చాలా ప్రధానమైంది. ఓడించాల్సింది మోదీ నిరంకుశత్వాన్ని, విచ్ఛిన్నక రమైన సంఘ్ పరివార్ సైద్ధాంతికతను అన్న అవగాహన ప్రతిపక్షాలకు సంపూర్ణంగా ఉండాలి. యశ్వంత్ సిన్హా అభ్యర్థిత్వం కచ్చితంగా ప్రతిపక్షాల మధ్య ఏక సూత్రత సాధించడానికి కావాల్సిన మార్గాన్ని సుగమం చేసింది. పేరుకే ఎన్.డి.ఎ. కాని అందులో ఆధిపత్యం, ప్రాధాన్యం అన్నీ బీజేపీ చేతి లోనే ఉన్నాయి. ఆ ఉన్న కొద్దిపాటి ఇతర పార్టీల మధ్య అగ్నిపథ్ లాంటి వాటి మీద ఏకశ్రుతి లేదు. నితీశ్ ఈ పథకాన్ని అంగీకరించడం లేదు. దీన్ని ప్రతిపక్షాలు వినియోగించుకోగలగాలి.

వంద బిలియన్ డాలర్ల పెట్టుబడులు పరార్

టి.వి.సుబ్బయ్య

దేశంలోకి అపారంగా విదేశీ పెట్టుబడులు (ఎఫ్‌డీఐలు) వచ్చాయని, మనం అన్ని విధాలుగా అభివృద్ధి చెందామని మన ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించి ఎన్నో రోజులు కాలేదు. ఇదంతా ప్రజలను నమ్మించడానికి చెప్పే మాటలేనని రెండురోజుల క్రితం రిజర్వు బ్యాంకు చేసిన ప్రకటన స్పష్టం చేసింది. దేశం నుండి వంద బిలియన్ డాలర్ల విలువైన విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడులు తరలిపోతున్నాయని ఇవి 240 డాలర్లకు చేరుకోవచ్చునని కూడా తాజా నివేదిక తెలిపింది. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ పాలనలో ప్రభుత్వ పెద్ద లకు అబద్ధాలు చెప్పడం బాగా అలవాటైన విద్య అని రిజర్వుబ్యాంకు చెప్పిన విషయం రుజువైంది. అలాగే నల్లధనం పెద్దనోట్ల రద్దుతో నిర్మూలన జరిగిం దని ప్రధాని అవకాశం వచ్చినప్పుడల్లా చెప్తుంటారు. నల్లధనం అంతా రిజర్వు బ్యాంకుకు చేరి శత, సహస్ర కోటీశ్వరుల ఖాతాలకు అది తెల్ల ధనంగా చేరి స్వీడన్ బ్యాంకులో ఉన్నట్లు తాజాగా ఇండియన్ ఫండ్స్ ఇన్ స్విస్ బ్యాంకుల (స్విస్ బ్యాకుల్లో భారత డబ్బు) తాజా నివేదిక తెలియ జేస్తోంది. 14 ఏళ్ల కాలంలో ఇప్పుడు అత్యధికంగా డబ్బు నిల్వలు ఉన్నాయని ఆ నివేదిక పేర్కొంది. అవినీతి నిర్మూలన జరిగిందని చెపుతున్న మోదీ దేనికీ స్పందించరు గనుక ఈ నివేదిక పైన ఆయనగానీ, అనుచరణగణంగానీ మౌనంగా ఉండి అబద్ధాలను వల్లిస్తూనే ఉంటారని గత ఎనిమిదేళ్ల అనుభవం చెప్తోంది.

రిజర్వుబ్యాంక్ తన నివేదికలో వంద బిలియన్ డాలర్ల విలువైన విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పీఐలు) మన దేశం నుంచి తరలిపోతున్నా యని హెచ్చరించింది. దేశం ఎదుర్కొంటున్న అనేక షాక్‌లలో ఇది ప్రధానమైందే. ఎందుకు తరలిపోతున్నాయి? దేశంలో అలజడి వాతావరణం, తీవ్ర ప్రతికూలతలవల్లేనని రిజర్వు బ్యాంకు అధ్యయన నివేదిక 2022 జూన్ 20న రాత్రి విడుదల చేసింది. ఒక ఏడాదిలోని జీడీపీలో ఎఫ్‌పీఐలు దాదాపు

3.2శాతం ఉంటాయని నివేదిక స్పష్టం చేసింది. 2008లో తలెత్తిన ఆర్థిక సంక్షోభంలాంటిది ఇదని పరిశోధనా పత్రం అభిప్రాయపడింది. ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ కూడా ఈ సమాచారాన్ని ధృవీకరించారు. ఇది తీవ్రమైన రిస్క్ అని కూడా ఆయన హెచ్చరించారు. దేశ ప్రజలను వణి కించిన కోవిడ్, సామాజిక ఉద్రిక్తతలు ఇంకా అనేక షాక్‌ల మూలంగా ఎఫ్‌పీఐలు ఇక్కడ నుండి 240 బిలియన్ డాలర్లు వెళ్లిపోయే అవకాశం అధికంగా ఉందని ఇది జీడీపీలో 7.7 శాతం ఉంటుందని కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఊహించని సంక్షోభం లాంటిదన్నారు.

అమెరికా, భారత్‌లో ఉన్న వడ్డీరేట్లలో తేడా ఉండటం కూడా ఈ పరి స్థితికి కారణాల్లో ఒకటి. అమెరికా కంటే మన దేశంలో వడ్డీరేట్లు తక్కువగా ఉన్నాయి, అందువల్ల కూడా విదేశీ పెట్టుబడులు తరలిపోతున్నాయి. అలాగే మార్కెట్‌లో ఒడిదొడుకులు తీవ్రంగా ఉండటం కూడా పెట్టుబడులు తరల డానికి మరో కారణం. 2022 ప్రారంభం నుండి మన దేశం విదేశీ పెట్టుబడులు అభివృద్ధి చెందిన దేశాలకు తరలిపోవడం పెరిగింది. ప్రస్తుత కాలెండర్ సంవత్సరంలో ఇప్పటికే 28 బిలియన్ డాలర్ల విలువైన ఎఫ్‌పీఐలు విదేశాలకు వెళ్లిపోయాయని నివేదిక పేర్కొంది. బహుశా ఇలాంటి సమా చారాన్ని వెల్లడించడానికి మోదీ ప్రభుత్వం అనుమతించడం కష్టమే. పాల కుల అనుకూల మీడియా సహజంగా మౌనం వహిస్తుంది. ఇంత తీవ్రమైన సమస్యను ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఇక వినియోగదారుల ద్రవ్యోల్బణ రేటు అమెరికాలో 41 ఏళ్ల కాలంలో అత్యంత ఎక్కువగా నమోదైంది. మన దేశంలోనూ పరిస్థితి అంత భిన్నంగా లేదు. ఈ సమాచారమంతా ఆర్‌బీఐ తాజా బులెటిన్‌లో ఉందని ప్రముఖ ఆంగ్ల పత్రిక వార్తను అందించింది.

విదేశాల్లో ఉన్న నల్లడబ్బు పెద్ద భూతంలా పెరిగిపోతున్న దశలోనూ అది తాండవమాడుతున్నా మన పాలకులు దీన్ని నిర్మూలించామని పదేపదే పాటపాడుతున్నారు. నల్లడబ్బు నిర్మూలన పేరుతో పెద్దనోట్లు రద్దు చేస్తే అది వికటించి దాని ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోంది. కార్పొరేట్లు శతకోటీ శ్వర్లు, లాభాలు మొత్తానికి పన్ను కట్టకుండా ఉండే వారే అధికం. సహజంగా వీరంతా పాలకుల ఆశ్రితులుగానే ఉంటారు. ప్రభుత్వాన్ని విమర్శించే రాజకీయ నాయకుల మీదకు సీబీఐ, ఈడీ సంస్థలను ప్రయోగించడం అలవాటైంది. నల్లధనాన్ని కనీసం తగ్గించడానికి సైతం ఎలాంటి చర్యలూ కనిపించవు. ప్రజాప్రతినిధులను అంగడి వస్తువుల్లాగా కొనుగోలు చేసే పాలకులు ఎవరికి మేలు చేస్తున్నారో అనే విషయం సామాన్యులకు పట్టదు. తెలి సిన ఆలోచనాపరులు వివిధ కారణాలతో పట్టించుకోరు. నల్లధనం సమస్య సజీవమే.

స్కూలు స్థాయి నుంచే విద్య కాషాయీకరణ!

అరుణ్ శ్రీవాస్తవ

బెనారస్ హిందూ యూనివర్సిటీలో అమిత్ షా మాట్లాడుతూ ప్రసిద్ధ చరిత్రకారు లను కూడా అవమానించారు. విదేశీ పాలకుల ఆదేశాల మేరకు ఈ చరిత్రకారులు రచనలు చేశారని ఆరోపించారు. ఎవరి ఆదేశాలో వెల్లడిస్తే బాగుండేది. వాస్తవాలు ఆధారంగానే చరిత్రకారులు చరిత్రను విశ్లేషిస్తారు. నిర్దిష్ట సంఘటనలను పరి గణలోకి తీసుకుంటారు. ఊహా ప్రపంచంలో చరిత్రకారుడు నిలవలేడు. కాషాయ చరిత్రకారులు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయవచ్చు. అయితే ప్రాచీన కాలంలో జరిగిన సంఘటనలను కాదని అనటానికి వీలులేదు. వాస్తవాలను కూడా వక్రీకరించలేరు. ఆర్‌ఎస్‌ఎస్ బీజేపీకి అనుకూలంగా ఉండే చరిత్రకారులను నూతన చరిత్ర రాయటానికి సంఘ్‌పరివార్ ప్రోత్సహిస్తోంది. విద్వేషాన్ని వెళ్లగక్కినప్పటికీ వాస్తవాలను వక్రీకరించలేరు.

హోంమంత్రి అమిత్ షా చరిత్రను తిరిగి రాయాలన్న పిలుపులో స్కూలు స్థాయి నుంచే పిల్లలకు విద్యా బోధన ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో ఉండాలన్న "లక్ష్యం" దాగి ఉంది. ఆయన ఇటీవల బెనారస్ హిందూ యూనివర్సిటీలో జరిగిన సెమినార్‌లో మాట్లాడారు. భారతీయ దృక్పథంతో చరిత్రను తిరిగి రాయాలని అన్నారు. "చరిత్రను సవరించటానికి మనల్ని ఎవరు ఆపుతున్నారు" అని ఆయన ప్రశ్నించారు. భారతీయ దృక్పథంతో చరిత్రను రాయలేదని కూడా ఆయన అన్నారు. ఆధునిక చరిత్రను దుయ్యబట్టడం, సుప్రసిద్ధులైన చరిత్ర కారులను అవమానించటం, చారిత్రక వాస్తవాలను వక్రీకరించటం బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు నిత్యకృత్యమై పోయింది. చరిత్రంతా తప్పుల తడక అని నిందలు వేస్తున్నారు. నరేంద్ర మోదీ అధికారానికి వచ్చిన నాటి నుంచి సంఘ్ పరివార్ చరిత్రకారులు విజృంభించారు. నిజంగా వీరికి చరిత్ర పరిజ్ఞానం చాలా తక్కువ. అయినప్పటికీ సంఘ్ పరివార్ కోణంలో చరిత్రను తిరిగి రాసేందుకు పూనుకున్నారు. పైగా వామపక్ష వాదులు వక్రీకరించిన చరిత్రను తాము సరిజేస్తున్నామని చెప్పుకుంటున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వం మత దృక్కోణంతోనే చరిత్రను చూస్తోంది. వీరికి వాస్తవికతతో పనిలేదు. అక్కడా ఇక్కడా విన్న విషయాలనే చర్చకు తెస్తున్నారు. ముస్లింల పట్ల విద్వేషాన్ని వెళ్లగక్కడమే భారతదేశ చరిత్రను వక్రీకరించటానికి ఆధారం చేసుకున్నారు.

ముస్లిం పాలకులు మన దేశంపై దండెత్తారని విమర్శిస్తారు. దేశ ప్రజ లంతా హిందువులే అన్న భావజాలంతోనే సంఘ్ పరివార్ ఈ విమర్శలు చేస్తోంది. ముస్లింలను గురించి ఏం చెప్పినా హిందువులు సమ్మతిస్తారనే బల మైన ఆలోచన ఆర్‌ఎస్‌ఎస్‌కు ఉన్నది. ఇక ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ మాత్రం జిమ్మిక్కులు చేస్తూ ఉంటారు. హిందువులు, ముస్లింలు ఒకే రకమైన డిఎన్‌ఏను కలిగి ఉన్నారని మాట్లాడతారు. ఈ వాస్తవాన్ని ముస్లింలు అంగీక రించినట్లయితే ముస్లింలు దండయాత్రలు చేశారన్న సమస్యే రాదని అంటారు. భారతీయ సంస్కృతిని చరిత్రకారులు ప్రతిబింబించాలని ఆయన చెప్తారు. మొఘలులు భారతదేశానికి రాకముందే అనేక మంది ముస్లిం రాజులు ఆనాడు సొంత రాజ్యాలను కలిగి ఉండి పరిపాలన చేశారు. అలాగే మొఘల్ రాజులలో ఎక్కువ మంది భారతదేశ సంస్కృతితో సమ్మిళితమయ్యారు. కొద్దిమంది మినహా అందరూ ఈ దేశాన్ని దోచుకోలేదు. తాము వచ్చిన ప్రాంతానికే తిరిగి వెళ్లిపోయారు. హిందూ రాజులు ఈ దేశాన్ని పరిపాలించలేదు. ఈ వాస్తవాలను ఆర్‌ఎస్‌ఎస్, ఇప్పుడు పుట్టుకొచ్చిన చరిత్రకారులు గుర్తించటానికి తిరస్కరి స్తున్నారు. చరిత్ర అర్థం తెలియని చలనచిత్ర రంగ వ్యక్తులు చరిత్రకు తీరని అపకారం చేస్తున్నారు.

బెనారస్ హిందూ యూనివర్సిటీలో అమిత్ షా మాట్లాడుతూ ప్రసిద్ధ చరిత్రకారులను కూడా అవమానించారు. విదేశీ పాలకుల ఆదేశాల మేరకు ఈ చరిత్రకారులు రచనలు చేశారని ఆరోపించారు. ఎవరి ఆదేశాలో వెల్లడిస్తే బాగుండేది. వాస్తవాలు ఆధారంగానే చరిత్రకారులు చరిత్రను విశ్లేషిస్తారు. నిర్దిష్ట సంఘటనలను పరిగణలోకి తీసుకుంటారు. ఊహా ప్రపంచంలో చరిత్రకారుడు నిలవలేడు. కాషాయ చరిత్రకారులు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయ వచ్చు. అయితే ప్రాచీన కాలంలో జరిగిన సంఘటనలను కాదని అనటానికి వీలులేదు. వాస్తవాలను కూడా వక్రీకరించలేరు. ఆర్‌ఎస్‌ఎస్ బీజేపీకి అను కూలంగా ఉండే చరిత్రకారులను నూతన చరిత్ర రాయటానికి సంఘ్ పరివార్ ప్రోత్సహిస్తోంది. విద్వేషాన్ని వెళ్లగక్కినప్పటికీ వాస్తవాలను వక్రీకరించలేరు. సరైన సమాచారం, వాస్తవాలను వక్రీకరించేందుకు ఈ నయా చరిత్రకారులు ఉత్సాహపడుతున్నారు. రామాయణంలో తులసీదాసు రాముడు పేదప్రజలను సమీకరించి రావణుడిపై పోరాడవలసిందిగా వారిని ప్రోత్సహించాడని లేదా పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడాడని రాసినట్లయితే అది తీవ్ర అతిశయమే అవుతుంది. సామాజిక శాస్త్రం నేపథ్యాన్ని విశ్లేషించకుండా చరిత్ర రచన చేస్తే దేశ వినాశనానికి దారి తీస్తుందని ఆర్‌ఎస్‌ఎస్, అమిత్ షా లాంటి నాయకులు గుర్తించాలి. హిందూత్వను ప్రచారం చేసి హిందు ఓట్లను సమీక రించటం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు ఎన్నికల్లో ప్రయోజనం పొందవచ్చు. ఆధునిక చరిత్రను సామాజిక శాస్త్రంతో కలిపి విశ్లేషించవలసిందే. సాక్ష్యాల ఆధారంగా రచనలు చేయవలసి ఉంటుంది. పురాణాలు, శ్లోకాలు అవసరమైన విస్తృత వనరుల్లో భాగమే.

1887లో ప్రథమ స్వాతంత్ర్య పోరాటాన్ని సావర్కర్ క్రాంతి అని పేర్కొ న్నారు. లేకపోతే దాన్ని తిరుగుబాటు అని కూడా ఈ తరం అనుకునేవాళ్లు అని అమిత్ షా అన్నారు. అయితే వాస్తవం దీనికి భిన్నమైంది. ఇంతకు ముందు చాలాకాలం క్రితమే కారల్ మార్క్స్ ప్రథమ స్వాతంత్ర్య పోరాటం అని ఆనాటి సంఘటనను వర్ణించారు. వామపక్ష వ్యతిరేక శక్తులు దీన్ని సిపాయిల తిరుగు బాటు అన్నాయి. ఆనాటి సెమినార్‌లో మాట్లాడిన అమిత్ షా "ఈ యూనివర్సి టీని స్థాపించిన కాలంలో మదన్ మోహన్ మాలవ్యా మనసులో ఏమున్నప్పటికీ, హిందు సంస్కృతిని ప్రచారం చేయటంలో కీలక పాత్ర వహించారు. ఈ సంస్కృతిని రక్షించేందుకు ఆయన గొప్ప కృషి చేశారు" అని షా చెప్పారు. అయితే ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తున్న విద్వేష రాజకీయాలను అనుసరించటానికి మాత్రం మాలవ్యా బెనారస్ యూనివర్సిటీని స్థాపించలేదన్న వాస్తవాన్ని గ్రహిం చాలి. అమిత్ షా పార్టీతో రాజకీయ పొత్తును కలిగి ఉన్న నితీష్ కుమార్ చరిత్రను తిరిగి రాయాలన్న ప్రకటనను తిరస్కరించారు. అంతేకాదు చరిత్రను ఎవరూ మార్చలేరు అని కూడా వ్యాఖ్యానించారు. వాస్తవాలను మాత్రం ఎవరూ మార్పు చేయలేరు.

యశ్వంత్‌కు నితీష్ ఓటేస్తారా?

రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్ష అభ్యర్థిగా యశ్వంత్ సిన్హాను పోటీ చేయించా లని ప్రతిపక్షాలు ఏకగ్రీవంగా తీర్మానించి ప్రకటించాయి. యశ్వంత్ టి.ఎం.సి.కి రాజీనామా చేసి రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఎన్.డి.ఎ. అభ్యర్థిగా మహిళ ద్రౌపది ముర్మును ఎంపిక చేసి ప్రకటించారు. ఇద్దరి మధ్యా గట్టి పోటీ ఉండవచ్చునని భావిస్తున్నారు. బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పార్టీ జె.డి.(యు) - బీజేపీకి మధ్య ఇటీవల విభేదాలు తలెత్తాయి. రెండు పార్టీల మధ్య పొసగడం లేదు. అగ్నిపథ్ పథకం కింద సైనిక అభ్యర్థులను ఎంపిక చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కూడా నితీష్ తప్పుపట్టారు. గతంలోనూ ఎన్.డి.ఎలో భాగస్వామిగా ఉన్న నితీష్ ఆనాడు రాష్ట్రపతి అభ్యర్థిగా యుపిఎ తరపున పోటీ చేసిన ప్రణబ్ ముఖర్జీకి ఓటు వేశారు. 2017లో ఆర్.జె.డి.తో కలిసి మహాఘట బంధన్‌లో భాగస్వామిగా ఉండి కూడా అప్పుడు ఎన్.డి.ఎ అభ్యర్థి రామనాథ్ కోవింద్‌కు ఓటు వేశారు. కోవింద్ రాష్ట్రపతిగా గెలుపొందిన తర్వాత మహాఘట బంధన్ నుండి వైదొలిగారు. ఇలా ప్రతిపక్ష అభ్యర్థులకే ఓటు చేసిన చరిత్ర ఆయనకు ఉన్నది. 2020లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత నుండి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీతో అంత సఖ్యత లేకుండా పోయింది. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎవరికి ఓటు చేయాలన్న అంశంపైన జె.డి.యు నాయకులు ఎవరూ మాట్లాడటం లేదు. జె.డి.యుకి 22,769 ఓట్లు ఉన్నాయి. ఇవి రాష్ట్రపతి ఎన్నికల్లో కీలకమైనవి. ఈ ఎన్నికల్లో పార్లమెంట్



సభ్యులు, రాష్ట్రాల అసెంబ్లీ సభ్యులు మాత్రమే ఓటు వేస్తారు. ఎంపీకి 700 ఓట్లు ఉంటాయి. అయితే ఎమ్మెల్యేకు జనాభా బలాన్ని బట్టి ఓటు విలువను నిర్ణయి స్తారు. ప్రతిపక్షాలన్నీ కలిసి కట్టుగా యశ్వంత్ సిన్హాకు ఓటు వేస్తే ఆయన గెలిచే అవకాశాలు ఉన్నాయి. అయితే కొన్ని ప్రతిపక్షాలు బీజేపీ అభ్యర్థికే ఓటు వేసే అవకాశాలు ఉన్నందున యశ్వంత్ సిన్హా గెలుపు సందేహాస్పదమే. ప్రతిపక్ష ఐక్యతపైనే యశ్వంత్ భవితవ్యం ఉంటుంది. పాలక పార్టీ అభ్యర్థి గెలుపు అంత తేలికేమీ కాదని భావిస్తున్నారు. 11 ప్రతిపక్షాలకు, వామపక్ష ఫ్రంట్‌కు కలిపి 3.8 లక్షల ఓట్లు ఉన్నాయి. రాష్ట్రపతి పదవిని గెలుచుకోవాలంటే మరో 20 వేల ఓట్లు అవసరం అవుతాయి. బిజు జనతాదళ్‌కు 31 వేల 705 ఓట్లు ఉన్నాయి. ఈ ఒక్క పార్టీ ప్రతిపక్ష అభ్యర్థికి ఓటు వేసినా ఆయనే గెలిచే అవకాశం ఉంటుంది. వైస్సార్ కాంగ్రెస్ పార్టీకి 45 వేల 798 ఓట్లు ఉన్నాయి. అయితే ఈ పార్టీ తప్పనిసరిగా అధికార అభ్యర్థికే ఓటు చేస్తుందని భావిస్తున్నారు.

అగ్నివీరులు బట్టలుతుకుతారా?

ఎం.కోటేశ్వరరావు

అగ్నిపథ్ పథకాన్ని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం దాని మీద నిరసనలు తలెత్తిన నేపథ్యంలో పథకాన్ని సమర్థించుకునేందుకు మిలిటరీ అధికారులను దించింది. ఇది ఒక ప్రమాదకర సాంప్రదాయం. మనది పాకిస్థాన్, ఇతర అనేక దేశాల మాదిరి మిలిటరీ కనుసన్నలలో నడిచే ప్రభుత్వం కాదు. ఈ పథకం మిలిటరీ రూపొందించింది తప్ప తమది కాదు అని తప్పుకొనేందుకా అన్నట్లుగా ప్రధాని, సంబంధిత శాఖ మంత్రి ఇంతవరకు స్పష్టమైన ప్రక టనతో దేశం ముందుకు రాలేదు. పరోక్షంగా సుభాషితాలు పలుకుతున్నారు. ఈ పథకంతో మిలటరీ ఎంపికలో సమూల మార్పులు చేశారు. ఇదేమీ రహస్యం కాదు.

ఈ పథకాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన తరవాతనే జూన్ 14న ప్రకటించారు. ఇలాంటి కీలకాంశం గురించి ముందుగా ప్రధానికి వివరించ కుండానే ఇదంతా జరుగుతుందంటే ఎవ్వరైనా నమ్ముతారా? ఈ పథకం ప్రక టనతో తలెత్తిన శాంతిభద్రతల సమస్య గురించైతే అది మిలటరీ అధి కారులకు సంబంధం లేదు, హోంశాఖ మంత్రి, ప్రతినిధులు వివరించాలి. తగిన కసరత్తు లేకుండా, ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా తీసుకొనే సంస్కరణలు దేనికి దారితీస్తాయో పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి, మూడు సాగు చట్టాల తీరుతెన్నులను చూశాం. అందుకే నష్టనివారణ చర్యగా ఈ తతంగం జరుగుతోందా అనే సందేహాలు కలగటం సహజం.

ఈ పథకానికి నిరసనగా సోమవారం భారత్ బంద్ జరిగింది. దాంతో ముందు జాగ్రత్త చర్యగా దేశమంతటా ఐదు వందలకు పైగా రైళ్లను రద్దు చేశారు. జార్ఖండ్‌లో స్కూళ్లను మూసివేశారు. ఢిల్లీ వంటి చోట్ల పోలీసుల అతి కారణంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. హర్యానాలో రెండు జిల్లాల్లో కోచింగ్ సెంటర్ల మూసివేతకు ఆదేశించారు. ఈ నెల 24న నిరసన తెలియజేయనున్నట్లు రైతు నేత రాకేష్ తికాయత్ ప్రకటించారు. అగ్నిపథ్ పథకం కింద శిక్షణ పొందిన వారు అగ్నివీరులమని చెప్పుకొనేందుకు సిగ్గుపడతారు. ఆ పథకం కింద ఎంపికైన వారికి మిలిటరీ శిక్షణలో భాగంగా ఇతర అంశాలతో పాటు బట్టలుతకటం, క్షవరం చేయటం, చౌకీదార్లుగా నైపుణ్యం కల్పిస్తారట. ఇక ఈ పథకం గురించి విమర్శల వెనుక టూల్‌కిట్ గ్యాంగ్ ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయ వర్గీయ ఆరోపించారు. మరి ఆ గ్యాంగ్ చిరునామా ఏమిటో వారి మీద కేంద్రం, బీజేపీ పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలేమిటో తెలీదు. ఒక వేళ అలాంటి గ్యాంగ్ ఉంటే వారు రూపొందిస్తున్న టూల్‌కిట్లకు టూల్స్ సర ఫరా చేస్తున్నది బీజేపీ నేతలే. విమర్శించేవారు చెప్పేది స్పష్టంగా ఉంది. సమర్థిస్తూ మాట్లాడేవారే అనేక అనుమానాలను రేకెత్తిస్తున్నారు. రైతు ఉద్యమం సందర్భంగా దిశ రవి అనే యువతి మీద కేంద్ర ప్రభుత్వం టూల్

కిట్ కేసు పెట్టి దేశద్రోహానికి పాల్పడినట్లు ఆరోపించి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. రైతుల ఆందోళనకు సంబంధించిన సమాచారాన్ని ఒక చోట చేర్చి సామాజికమాధ్యమంలో అందుబాటులో ఉంచటాన్నే టూల్‌కిట్‌గా వర్ణించారు.

బీజేపీ ఆఫీసులకు అవసరమైన భద్రతా సిబ్బంది నియామకంలో అగ్ని వీరులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు కైలాష్ విజయ వర్గీయ. ఆ పెద్దమనిషి ఆరుసార్లు ఎంఎల్ఏగా, 12 ఏండ్లు మంత్రిగా పని చేసి ఇప్పుడు వార సత్వంగా కుమారుడు ఆకాష్‌ను ఎంఎల్ఎ చేశారు తప్ప బీజేపీ ఆఫీసులో చౌకీ దారుగా నియమించలేదు. నోటికొచ్చినట్లు మాట్లాడటం కైలాష్‌కు కొత్తేమీ కాదు. సొంత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో బీజేపీ నేత లక్ష్మీకాంత శర్మ వంటి వారి ప్రమేయం ఉన్న వ్యాపం కుంభకోణం గురించి విలేకర్లు అడిగితే అది మీకు పెద్దది కావచ్చు గాని మాకు చిన్న కుంభకోణం అని సెలవిచ్చారు. దాని గురించి వివరాలు సేకరిస్తున్న జర్నలిస్టు అక్షయ సింగ్ అనుమానాస్పద స్థితిలో మరణించటం గురించి అడిగితే మరణించిన ఆ జర్నలిస్టును మరచి పొండి, నాకంటే అతను ముఖ్యమా అని ఎదురు ప్రశ్నించారు. అంతేనా దేశంలో జరుగుతున్న మానభంగాల గురించి అడిగితే మహిళలు వారి హద్దుల్లో వారు లేకపోతే పర్యవసానాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది అని సెలవిచ్చారు. ఇండోర్ నగరంలో పాతభవన కూల్చివేతను పర్యవేక్షిస్తున్న ఒక అధికారిని కుమారుడు ఆకాష్ హాకీ బాట్‌తో కొట్టటాన్ని సమర్థించి పుత్ర ప్రేమను చాటుకున్నారు. వివాదాస్పద మాటలతో ఎప్పుడూ జనం నోళ్లలో నానుతున్న కైలాష్ అగ్నివీరులను బీజేపీ ఆఫీసులో చౌకీదార్లుగా పెడతామని చెప్పటంలో ఆశ్చర్యం ఏముంది!

దేశం కోసం ప్రాణాలర్పించేందుకు సిద్ధపడి మిలటరీలో చేరుతున్న వారిని కించపరిచేలా ఉన్న తన వ్యాఖ్యలు దుమారం రేపటంతో తన మాటలను టూల్‌కిట్ గ్యాంగ్ వక్రీకరించిందని ఎదురు దాడికి దిగారు. మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం కైలాష్ ఇలా మాట్లాడారు. "నేను గనుక బీజేపీ ఆఫీసులో భద్రతా సిబ్బందిని పెట్టాల్సి వస్తే అగ్నివీరులకు ప్రాధాన్యత ఇస్తా, మీరు కూడా చేరవచ్చు. నా స్నేహితుల్లో ఒకరు 35 ఏండ్ల రిటైర్డ్ మిలటరీ వ్యక్తిని సెక్యూరిటీ గార్డుగా పెట్టుకున్నారు, అతని మీద తనకు నమ్మకం ఉందని చెప్పారు. అతను సైనికుడు కాబట్టి తాను భయపడలేదని చెప్పారు. దీని అర్థం ఏమిటి సైనికుడు అంటే ఆత్మవిశ్వాసం" అని కైలాష్ చెప్పారు. దీని మీద విమర్శలు తలెత్తటంతో వివరణ ఇచ్చుకుంటూ అంతకు ముందు చెప్పినదాన్ని సమర్థించుకున్నారు. "అగ్ని పథ్ పథకం కింద శిక్షణ పొందిన అగ్నివీరులు తమ సర్వీసు పూర్తి చేసిన తరవాత వారు తప్పనిసరిగా నైపుణ్యం పొందుతారు, తమ విధుల పట్ల అంకిత భావంతో ఉంటారు. మిలటరీలో తమ సేవ పూర్తైన తరవాత ఎంచుకునే రంగాలలో ఈ నైపుణ్యాన్ని ఉపయోగించుకోవచ్చు. ఇదీ నేను చెప్పదలచుకున్నది. టూల్‌కిట్ ముఠాలతో సంబంధం ఉన్న నా మాటలను వక్రీకరించి శ్రమ జీవులను కించపరిచేందుకు చూస్తున్నారు. ఇది ఈ దేశ కర్మవీరులకు అవమానం. రాష్ట్ర వీరులు-ధర్మ వీరులకు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్న ఈ టూల్‌కిట్ ముఠా గురించి దేశా నికి బాగా తెలుసు" అన్నారు. నైపుణ్యం, అంకిత భావం ఒక్క మిలటరీకేనా, ఇతర పౌర సేవల్లో ఉన్నవారికి అవసరం లేదా ?

దేశ యువతను అవమానించవద్దని ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. వారు దేశం కోసం పని చేసేందుకు సిద్ధం అవుతున్నారు తప్ప బీజేపీ ఆఫీసు వెలుపల చౌకీదార్లుగా పని చేసేందుకు కాదు అన్నారు. 2019లో నేను కూడా చౌకీదారునే అనే బీజేపీ ప్రచారం అర్థం ఏమిటో ఇప్పుడు కైలాష్ మాటల ద్వారా బోధపడిందని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ చమత్కరించారు. బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ కూడా విమర్శించారు. మిలటరీ అంటే దేశసేవ కోసం తప్ప కేవలం ఉపాధి కోసం కాదన్నారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కూడా అగ్నివీరుల గురించి అనుచితంగానే మాట్లాడారు. "అగ్ని వీరులకు ఇతర అంశాలతో పాటు ఎలక్ట్రీషియన్లుగా, డ్రైవర్లుగా, బట్టలుతికేవారిగా, క్షురకులుగా అన్ని రకాల శిక్షణ ఇస్తారు" అన్నారు. నైపుణ్య శిక్షణ పేరుతో కార్యక్రమం ఉంది కదా అన్న విలేకర్ల ప్రశ్నకు మిలటరీలో శిక్షణ ఇవ్వకూడదా అని ఎదురు ప్రశ్నించారు. ఈ పనులు చేసేందుకు మిలటరీలో చేరాలా అనే ప్రశ్న ఎదురవుతుందనే విచక్షణ బీజేపీ నేతలకు లేకపోయింది. బట్టలుతికేందుకు మిషన్లున్నాయి. మిలటరీ, పోలీసు క్రాఫ్‌లు చేసేందుకు నిజానికి పెద్ద నైపుణ్యంతో పనేముంది.

ఎనిమిదేళ్లైనా ఉద్యోగం రాలేదు

కోల్‌కతాలో రోడ్డెక్కిన టెట్ అభ్యర్థులు

రహదారులు దిగ్బంధం

100 మంది అరెస్టు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని టీచర్ల అర్హత పరీక్ష (టెట్) అభ్యర్థులు బుధవారం ఆందోళన బాట పట్టారు. 2014లో పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించినప్పటికీ ఉద్యోగాలు రాకపోవడంపై ఆగ్రహంతో రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. రహదారులను దిగ్బంధించారు. ఎనిమిదేళ్లు గడిచినా ఉద్యోగం ఊసే లేదని, ఇది తమకు జీవన్మరణ సమస్య అని, న్యాయం జరిగేంత వరకు విశ్రమించేది లేదంటూ నినదించారు. ప్రధాన రహదారిని దిగ్బంధించారు. అంగుళం కూడా వెనక్కు వెళ్లేది లేదని భీష్మించారు. దీంతో 100 మంది నిరసనకారులను కోల్‌కతా పోలీసులు అరెస్టు చేశారు. అశుతోష్ ముఖర్జీ రోడ్డు- హజారా రోడ్డు క్రాసింగ్ వద్ద మధ్యాహ్నం 1.30 గంటలప్పుడు దిగ్బంధ కార్యక్రమం జరిగిందని, నిరసనకారులు కదలకపోవడంతో వారిని అదుపులోకి తీసుకోవాల్సి వచ్చిందని పోలీసు అధికారి తెలిపారు. పోలీసులు తమతో దుసురుగా వ్యవహరించారని, నేలపై పడవేశారని ఆందోళనకారులు చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. నిరసనకారులు రెచ్చగొట్టినప్పటికీ పోలీసులు సంయమనం పాటించారని, ట్రాఫిక్ జామ్ కాకూడదనే ఖాళీ చేయించారని చెప్పారు. కౌశిక్ సాహా అనే నిరసనకారుడు మాట్లాడుతూ, '2014లో పరీక్ష, ఇంటర్వ్యూలో జరిగాయి. ఉత్తీర్ణులయ్యాంగానీ 2022లోనూ ఉద్యోగాలు రాలేదు. ఇది మాకు జీవన్మరణ సమస్య' అని అన్నారు. 50-100 మందిని కాదు వేలాది టెట్ అర్హత సాధించిన అభ్యర్థులను విస్మరించి తక్కువ మార్కులు వచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చారని మరొక నిరసనకారుడు దేబర్షి బానిక్ ఆరోపించారు. న్యాయం జరిగే వరకు విశ్రమించమన్నారు. టెట్ అభ్యర్థుల నిరసనకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత సువేందు అధికారి మద్దతును ప్రకటించారు. రాష్ట్రంలోని స్కూలు టీచర్ల నియామకాల్లో కుంభకోణంపై సీబీఐ విచారణ కొనసాగుతోంది. ఇదే క్రమంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం అసెంబ్లీలో మాట్లాడారు. కేవలం వేటు వేసేందుకు కోర్టులకు వెళ్లే వారిలా మేము కాదు. ఉద్యోగాలను సృష్టించేందుకు ప్రయత్నించాం. దాదాపు లక్ష మందికి ఉద్యోగాలిచ్చాం. 50-100 కేసుల్లో తప్పు జరిగివుండవచ్చు' అని అన్నారు. టీఎంసీ అధికార ప్రతినిధి కునాల్ ఘోశ్ స్పందిస్తూ ఈ అంశాన్ని రాజకీయం చేసి ఆందోళనలను రెచ్చగొడుతున్నట్లు విపక్షాలపై ఆరోపణలు చేశారు. నియామకాల్లో అవకతవకలు జరిగితే ప్రభుత్వం చూసుకుంటుందని ఆయనన్నారు.

రబ్బరు స్టాంపు రాష్ట్రపతి అక్కర్లేదు

27న నామినేషన్ - జార్ఖండ్, బీహార్ నుంచి ప్రచారం

ప్రచార వ్యూహంపై యశ్వంత్ సిన్హా తొలి సమావేశం

న్యూఢిల్లీ : దేశానికి 'రబ్బరు స్టాంపు రాష్ట్రపతి' అక్కర్లేదని ప్రతిపక్షాల ఉమ్మడి రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా నొక్కిచెప్పారు. రాష్ట్రపతి ఎన్నిక అన్నది వ్యక్తిగత పోరు కాదని, దేశం ఎదుర్కొంటున్న సమస్యల కోసం పోరాటమని అన్నారు. 27వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే, జార్ఖండ్, బీహార్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తానన్నారు. దేశానికి అనువుకాని పథంలో బీజేపీ ప్రభుత్వం సాగుతోందన్నారు. యువతకు వెతలు తప్పడం లేదని, అగ్నిపథ పథకం ద్వారా నిరుద్యోగాన్ని 'జోక్' చేసిందని సిన్హా విమర్శించారు. రాష్ట్రపతి పదవి చాలా సున్నితమైనది... ప్రభుత్వం నుంచి తనపై ఎలాంటి ఒత్తిడి ఉండదని ఆయన అన్నారు. ప్రచారంలో భాగంగా దేశంలో పర్యటిస్తామని, ఇందుకోసం ఓ వ్యూహాన్ని రూపొందిస్తున్నామని సిన్హా తెలిపారు. తన ప్రచార వ్యూహంపై ఆయన తొలి సమావేశాన్ని ఏర్పాటు చేయగా, ఎన్సీపీ నేత కేకే శర్మ, కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, యోగేంద్ర శాస్త్రి, సుధీంద్ర కులకర్ణి హాజరయ్యారు. అలాగే, ఎన్డీయే తరపున రాష్ట్రపతి అభ్యర్థిత్వం పొందిన ద్రౌపది ముర్ముకు సిన్హా శుభాకాంక్షలు తెలిపారు. 'ఇది మా ఇద్దరి మధ్య పోటీ కాదు.. రెండు సిద్ధాంతాల మధ్య పోరు. ఏదిఏమైనా దేశానికి రబ్బర్ స్టాంపు రాష్ట్రపతి ఉండకూడదు' అని యశ్వంత్ సిన్హా నొక్కిచెప్పారు.

అసెంబ్లీ రద్దు దిశగా 'మహా' సంక్షోభం: రౌత్

ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో ఉద్ధవ్ ఠాక్రే సీఎం పదవికి రాజీనామా చేయడం ఖాయమేనన్న చర్చ జరుగుతోంది. 'అసెంబ్లీ రద్దు' గురించి శివసేన ఎంపీ సంజయ్ రౌత్ చేసిన ట్వీట్ ఈ ఊహాగానాలను మరింత బలపరుస్తోంది. మరోవైపు ఉద్ధవ్‌ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే తన ట్విట్టర్ బయో నుంచి 'రాష్ట్ర మంత్రి' అనే పదాన్ని తొలగించారు. మహారాష్ట్రలో తాజా రాజకీయ పరిణామాలపై సంజయ్ రౌత్ బుధవారం సంచలన ట్వీట్ చేశారు. 'రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ సంక్షోభం.. విధాన సభ రద్దు దిశగా సాగుతోంది' అని రౌత్ పేర్కొన్నారు. దీంతో మహా వికాస్ అఘాడీ కూటమి ప్రభుత్వం నుంచి దిగిపోవాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. అంతకుముందు రౌత్ మాట్లాడుతూ... 'అధికారం తాత్కాలికమైనది. ఇప్పుడు మేం అధికారాన్ని కోల్పోయినా.. మళ్లీ తిరిగొస్తాం' అని వ్యాఖ్యానించడం గమనార్హం. మరోవైపు రాష్ట్ర మంత్రి, ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే తన ట్విట్టర్ బయో నుంచి 'రాష్ట్ర మంత్రి' అనే పదాన్ని తొలగించారు. ఇది కూడా అసెంబ్లీ రద్దు ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది.

భారత్‌లో మలేరియా కేసులు తగ్గుముఖం

న్యూఢిల్లీ: దేశంలో మలేరియా కేసుల సంఖ్య 2015 నుంచి 86 శాతం తగ్గింది. 2015-2021 మధ్య ఈ వ్యాధి కారణంగా మరణాల సంఖ్య కూడా 79 శాతం తగ్గిందని 'మలేరియా నోమోర్' సంస్థ వెల్లడించింది. 2017-2019 మధ్య మలేరియా నియంత్రణకు దేశ బడ్జెట్ కేటాయింపు రెండింతలు పెరిగిందని 'మలేరియా నిర్మూలనకు ఇండియా ప్రయాణం' పేరుతో రూపొందించిన నివేదిక పేర్కొంది. 2030 నాటికి దేశం నుంచి మలేరియాను నిర్మూలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వ్యాధికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం చేయడానికి ప్రైవేట్ రంగం, వ్యక్తులు, సంఘాల నుండి ఎక్కువ భాగస్వామ్యాన్ని పొందడం వంటి కొన్ని సంక్లిష్టతలను పరిష్కరించాల్సి ఉందని నివేదిక వెల్లడించింది. బుధవారం ఇక్కడ మలేరియాపై ఏర్పాటు చేసిన మీడియా సెన్సిటైజేషన్ వర్క్‌షాప్‌లో మలేరియా నో మోర్ ఇండియా డైరెక్టర్ ప్రతీక్ కుమార్ మాట్లాడుతూ... భారతదేశంలో మలేరియా పేదవారి వ్యాధిగా పరిగణనలో ఉందని, అందువల్ల ప్రజారోగ్య అజెండాలో తక్కువ ప్రాధాన్యత లభిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి మరిన్ని చర్యల ద్వారా మలేరియా నిర్మూలించాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే, ఈ లక్ష్యాన్ని ప్రభుత్వం మాత్రమే సాధించదని, సమాజంలోని అన్ని వర్గాల క్రియాశీల భాగస్వామ్యం, మద్దతు అవసరమని ఆయన అన్నారు. మలేరియాను నిర్మూలించే ప్రయత్నంలో అందరూ చేతులు కలిపితేనే 2030 నాటికి దేశం నుంచి వ్యాధిని నిర్మూలించే లక్ష్యాన్ని భారతదేశం సాధించగలదని కుమార్ అన్నారు.

ఇలాంటి పోలీసులను ఎన్నడూ చూడలేదు

అశోక్ గెహ్లాట్ విమర్శ

న్యూఢిల్లీ: దేశంలో నియంతృత్వం రాజ్యమేలుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ విమర్శించారు. ఇలాంటి సమయంలో పోలీసులు సైతం అదే కొనసాగిస్తారని చెప్పారు. రాహుల్‌గాంధీని ఈడీ ప్రశ్నించడానికి నిరసనగా ఆందోళనకు దిగిన ప్రతిపక్ష నాయకులను పోలీసులు శత్రువులుగా చూశారని, మోదీ పాలనలో ఇంతకన్నా ఏమి ఆశించగలమని ఆయన వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా మోదీ సర్కారు తప్పుడు ధోరణి అవలంబిస్తోందని మండిపడ్డారు. గతంలోనూ రాజకీయ పార్టీలు నిరసనలు, ఆందోళనలు కొనసాగించాయని, అయితే, పోలీసులు ఇప్పటి మాదిరిగా అనుచితంగా వ్యవహరించలేదని రాజస్థాన్ ముఖ్యమంత్రి గెహ్లాట్ చెప్పారు. తమ నాయకులు ప్రత్యేకించి మహిళలను పోలీసులు లక్ష్యంగా చేసుకున్నారని, తీవ్రంగా కొట్టారని, గంటలకొద్దీ నిర్బంధించారని గెహ్లాట్ విలేకరుల సమావేశంలో విమర్శించారు. రాహుల్‌గాంధీని ఈడీ ఐదు రోజుల్లో 50గంటలు ప్రశ్నించింది. 'మొదటిసారిగా కాంగ్రెస్ నాయకులను శత్రువులుగా పరిగణించారు. కాంగ్రెస్ నాయకులు భారతదేశ పౌరులు కాదన్నట్లు పోలీసులు వ్యవహరించారు. ఐదు రోజులూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఇది సమాఖ్య దేశం. రాష్ట్రాలు కూడా సమాఖ్య స్ఫూర్తితోనే పనిచేస్తాయి. ప్రతిపక్ష బీజేపీ పట్ల ఇదే ధోరణి ప్రదర్శించాల్సి ఉంటుంది' అని గెహ్లాట్ హెచ్చరించారు. 'పోలీసులు భయోత్పాతం సృష్టించడాన్ని మొదటిసారి చూశాం. ఇది ఆందోళనకరం. మోదీ నియంతృత్వ పాలనలో పోలీసులు తీరు కూడా అలాగే ఉంటుందని రుజువైంది' అని సీఎం తెలిపారు. రాజకీయాల్లో శత్రుత్వానికి తావు లేదని, అధికార, విపక్షాలు తమ పాత్ర పోషిస్తాయని చెప్పారు. ప్రతిపక్షాలు ఆందోళనలు చేస్తాయి. నాయకులు, కార్యకర్తలు అరెస్టవుతారు. పోలీసులు సంయమనంతోనే ఉంటారని తెలిపారు. అవినీతి, విరాళాల ద్వారా బీజేపీ దేశాన్ని దోచుకుంటుందని గెహ్లాట్ విమర్శించారు. మోదీ పాలనలో పూర్తిగా దోచుకోవడానికి స్వేచ్ఛ కల్పించారన్నారు. వాజ్‌పేయి పాలనలోనూ ఇలా జరగలేదని ఆయన ఆరోపించారు. రాహుల్‌గాంధీ వంటి ప్రతిపక్ష నేతలను ఈ తరహా ప్రశ్నించడం ఏనాడు జరగలేదని చెప్పారు.

'నన్ను కిడ్నాప్ చేశారు': శివసేన ఎమ్మెల్యే

ముంబై: మహారాష్ట్ర రాజకీయ సంక్షోభానికి బీజేపీ 'ఆపరేషన్ కమల్' కారణమంటూ ఆరోపణలు వెల్లువెత్తుతోన్న వేళ శివసేన ఎమ్మెల్యే ఒకరు సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను కిడ్నాప్ చేసి గుజరాత్‌కు బలవంతంగా తీసుకెళ్లారని ఆరోపించారు. వారి నుంచి తప్పించుకుని తాను ముంబైకి వచ్చేశానని, తన మద్దతు ఉద్ధవ్ ఠాక్రేకే అని స్పష్టం చేశారు. శివసేన ఎమ్మెల్యే నితిన్ దేశ్‌ముఖ్ బుధవారం ఉదయం గుజరాత్ నుంచి ముంబై చేరుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ఏక్‌నాథ్ షిండే నన్ను తప్పుదోవ పట్టించి సూరత్ తీసుకెళ్లారు. మహా సీఎంకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్నామని నాకు ముందు చెప్పలేదు. అక్కడకు వెళ్లాక అసలు విషయం తెలిసి నేను హోటల్ నుంచి బయటకు వచ్చాను. కానీ నన్ను పోలీసులు అడ్డుకున్నారు. దాదాపు 100-150 మంది పోలీసులు నా వెనుకే వచ్చి నాకు గుండెపోటు వచ్చిందంటూ బలవంతంగా ఆసుపత్రికి తీసుకెళ్లారు. నాకు ఎలాంటి అనారోగ్యం లేదు. నేను ఫిట్‌గా ఉన్నాను. ఆ తర్వాత ఆసుపత్రిలోనూ నన్ను హత్య చేయడానికి కుట్రలు జరిగాయి. ఏదో ఇంజెక్షన్ ఇవ్వడానికి ప్రయత్నించారు. ఎలాగొలా వారి నుంచి తప్పించుకుని ముంబై చేరుకున్నా' అని దేశ్‌ముఖ్ వివరించారు. తాను ఎప్పటికీ శివ సైనికుడినేనని, ఉద్ధవ్ ఠాక్రేకు తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. మరోవైపు, నితిన్ దేశ్‌ముఖ్‌తో పాటు మరో శివసేన ఎమ్మెల్యే కూడా రెబల్స్ శిబిరం నుంచి వెనక్కి వచ్చినట్లు తెలుస్తోంది. కాగా.. నితిన్ దేశ్‌ముఖ్ కన్పించట్లేదంటూ మంగళవారం ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూన్ 20 రాత్రి 7 గంటలకు తన భర్తతో మాట్లాడానని, ఆ తర్వాత నుంచి ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని దేశ్‌ముఖ్ భార్య ప్రాంజలి ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్తకు ప్రాణహాని ఉందని ఆరోపించారు.

26న జర్మనీకి ప్రధాని మోదీ

ఆ దేశ ఛాన్సలర్ ఆహ్వానం మేరకు జీ7 సదస్సుకు

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 26, 27 తేదీల్లో జర్మనీలో పర్యటించనున్నారు. దక్షిణ జర్మనీలోని ఆల్ఫిన్ క్యాస్టెల్ ఆఫ్ స్కాలాస్ ఎల్మావును ఆయన సందర్శిస్తారు. జీ7 వార్షిక సదస్సులో పాల్గొనేందుకు మోదీ జర్మనీ వెళ్లనున్నారు. అక్కడ నుంచి నేరుగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్‌కు వెళ్లి, గల్ఫ్ దేశానికి మాజీ అధ్యక్షుడు షేక్ ఖలీఫా బిన్ జాయద్ అల్ నహ్యాన్‌కి నివాళి అర్పిస్తారు. జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ స్కలోజ్ ఆహ్వానం మేరకు జీ7 సదస్సుకు మోదీ వెళుతున్నారని విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. సదస్సులో పర్యావరణం, ఇంధనం, వాతావరణం, ఆహార భద్రత, ఆరోగ్యం, లింగ సమానత్వం, ప్రజాస్వామ్యం అంశాలపై జరిగే రెండు సెషన్స్‌లలో మోదీ ప్రసంగిస్తారని ఎంఈఏ వెల్లడించింది. పరస్పరం సంబంధాలను పటిష్టపర్చుకోవడమే మోదీ పర్యటన ముఖ్యఉద్దేశంగా తెలిపింది. వేర్వేరు నాయకులతో మోదీ ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహిస్తారని పేర్కొంది. జర్మనీ పర్యటనను ముగించుకొని 28న యూఏఈకి మోదీ చేరుకుంటారని, అక్కడ మాజీ అధ్యక్షుడికి నివాళు లర్పిస్తారని ఎంఈఏ వెల్లడించింది. దేశ నూతన అధ్యక్షుడు, అబుదాబీ రాజు షేక్ మహమ్మద్ బిన్ జాయద్ అల్ నెహ్యాన్‌కు శుభాకాంక్షలు తెలుపుతారని తెలిపింది. షేక్ ఖలీఫా దీర్ఘకాలిక వ్యాధితో పోరాడుతూ మే 13న మృతి చెందిన విషయం విదితమే. కాగా, జీ7 చైర్‌గా జర్మనీ ఉండగా బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, అమెరికా సభ్య దేశాలుగా ఉన్నాయి. భారత్-జర్మనీ మధ్య ఐజీసీ సదస్సులో పాల్గొనేందుకు మే 2న మోదీ జర్మనీకి వెళ్లడం విదితమే. తాజా సదస్సులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడ్యూయ్ తదితర అగ్రనేతలు పాల్గొంటారు.

చంపేస్తామంటున్నారు

బీజేపీ మాజీ ఎమ్మెల్యేపై భార్య ఫిర్యాదు

బుదౌన్ : కట్టుకున్న భర్త సహా ఆయన కుటుంబసభ్యుల నుంచి తనకు ప్రాణ హాని ఉందని ఉత్తరప్రదేశ్‌కి చెందిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే రామ్‌సేవక్ సింగ్ భార్య భాగ్యశ్రీ పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కారు. తన భర్త, ఆయన కుటుంబ సభ్యులు అందరూ తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని తమకు ఫిర్యాదు చేసినట్లు బుదౌన్ సీనియర్ ఎస్పీ ఓపీ సింగ్ తెలిపారు. తన భర్త సోదరుడు మహేంద్ర, కుమారుడు రోహిత్ పటేల్, కోడలు పింకీ, కుమార్తె రష్మీలు తనపై దాడి చేసి చంపేస్తామని బెదిరించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన రామ్‌సేవక్ సింగ్‌ను ఈ వ్యవహారంపై ప్రశ్నించగా తాను అనారోగ్యంతో బాధపడుతున్నానని, ఈ విషయం తనకు తెలియదని చెప్పినట్టు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా భాగ్యశ్రీ సదరు మాజీ ఎమ్మెల్యేకు నాలుగవ భార్య కావడం విశేషం. వారి వివాహం 2007లో జరిగినట్లు తెలుస్తోంది.

దేశవ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసులు

ఒక్కరోజులో 13 మంది మృతి

న్యూఢిల్లీ : దేశంలో కరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో కొత్తగా 12,249 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. కరోనాతో 13 మంది మృతి చెందారు. మృతి చెందినవారిలో ఎనిమిది మంది కేరళకు చెందిన వారుకాగా ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందినట్లు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ బుధవారం విడుదల చేసిన చేసిన డేటా వెల్లడించింది. మంగళవారంతో పోల్చి చూస్తే 2,374 కేసులు అధికంగా నమోదైనట్లు పేర్కొంది. తాజాగా నమోదైన కేసులతో కలిపి దేశంలో 81,687 కరోనా యాక్టివ్ కేసులున్నట్టు తెలిపింది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకూ 196.45 కోట్ల వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశారు. ఇక ఇప్పటివరకూ మొత్తం 4,33,31,645 కేసులు నమోదుకాగా, 5,24,903 మంది మృతి చెందినట్టు తెలిపింది. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న వాక్సినేషన్ కార్యక్రమంలో మొత్తం 196.45 కోట్ల డోసులు అందించినట్టు తెలిపింది.

తేజస్వి యాదవ్ నేతృత్వంలో పాట్నాలో అగ్నిపథ్ వ్యతిరేక ఆందోళన

అసెంబ్లీ నుంచి రాజ్‌భవన్‌కు మార్చ్

పాట్నా : సైనిక నియామకాలకు సంబంధించి కేంద్రం రూపొందించిన అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా పాట్నాలో ప్రతిపక్ష ఆర్‌జేడీ శ్రేణులు బుధవారం రోడ్డెక్కాయి. అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆర్‌జేడీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ నేతృత్వంతో అసెంబ్లీ నుంచి రాజ్‌భవన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ ఫాగు చౌహాన్‌ను కలిసి అగ్నిపథ్ పథకాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తేజస్వి యాదవ్ మాట్లాడుతూ... రక్షణ రంగంలో ఉద్యోగాలు పొందాలని భావిస్తున్న యువతకు అగ్నిపథ్ పథకం శరాఘాతంగా మారిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రైల్వేలు, ఏర్ ఇండియా, విమానాశ్రయాలు సహా వివిధ ప్రభుత్వ సంస్థలను అమ్మేసి తాజాగా రక్షణ రంగాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆరోపించారు. అగ్నిపథ్ ఉద్యోగాల పట్ల యువత సంతృప్తిగా లేరని, వారు ఆ ఉద్యోగాల్లో చేరి సరిహద్దుల్లో రక్షణ విధులు ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. పైగా నాలుగేళ్ల అనంతరం తమ పార్టీ కార్యాలయాల ముందు కాపలా ఉద్యోగాలు ఇస్తామంటూ బీజేపీ నేతలు యువతను అవమానిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో తాము గవర్నర్‌ను కలసి ఆ పథకాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, రాష్ట్రంలో చోటు చేసుకున్న నిరసనల తరుణంలో నమోదైన కేసులను రద్దు చేయాలని, అరెస్టు చేసిన విద్యార్థులను విడుదల చేయాలని డిమాండు చేస్తూ గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు.

శరద్ పవార్‌తో కమల్‌నాథ్ కీలకభేటీ

ముంబై : మహారాష్ట్రలో రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో అధికార కూటమి వర్గాల్లో కలవరపాటు మొదలు అయింది. ఇదే క్రమంలో ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్‌తో కాంగ్రెస్ సీనియర్ నేత, మహారాష్ట్రకు ఏఐసీసీ పరిశీలకుడు కమల్‌నాథ్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో పాటు రాష్ట్రపతి ఎన్నికలు తదితర అంశాలపై తాము చర్చించినట్లు ముంబైలోని యశ్వంత్‌రావు చవాన్ సెంటర్‌లో భేటీ అనంతరం పవార్ ట్వీట్ చేశారు. అంతకుముందు ఎన్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్, హోంమంత్రి దిలీప్ వాల్సే పాటిల్‌తోనూ పవార్ సమావేశమయ్యారు.

'మహా' సంక్షోభం... గవర్నర్, సీఎంలకు కరోనా

ముంబై: మహారాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారీ బుధవారం ఆస్పత్రిలో చేరారు. ఆయనకు కరోనా సోకినట్టు అధికారులు తెలిపారు. 'నేను కోవిడ్ బారిన పడ్డాను. స్వల్ప లక్షణాలున్నాయి. ముందు జాగ్రత్త చర్యగా ఆస్పత్రిలో చేరాను' అని కోశ్యారీ ట్వీట్ చేశారు. కోశ్యారీ (80) ఎల్లప్పుడూ మాస్క్ ధరించే ఉంటారు. అయినా కరోనా సోకిందని అధికారులు తెలిపారు. గవర్నర్‌తో పాటు సీఎం ఉద్ధవ్ ఠాక్రేకూ కరోనా సోకిందని బుధవారం అధికారులు తెలిపారు. యాంటీజెన్ పరీక్షలో పాజిటివ్ అని తేలిందని సీఎంఓ తెలిపింది. వర్చువల్‌గా జరిగిన కేబినేట్ సమావేశానికి సీఎం హాజరయ్యారు. మహారాష్ట్రలోని ఠాక్రే నేతృత్వంలో ప్రభుత్వం సంక్షోభంలో ఉన్న సమయంలో సీఎంను కలిసేందుకు తాను ముంబైవచ్చానని, కానీ ప్రస్తుతం ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటున్నట్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కమల్‌నాథ్ తెలిపారు.

రాజస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో వానలు

జైపూర్: గడచిన 24 గంటల్లో రాజస్థాన్‌లోని బికనీర్, జోధ్‌పూర్, జైపూర్, అజ్మీర్, కోట, భరత్‌పూర్ డివిజన్‌లలో వర్షం పడింది. మంగళవారం బికనీర్‌లోని నోకాలో 5 మిల్లీ మీటర్లు, ఛబ్రా, మౌంట్‌అబూలోని 4 సెంటీమీటర్లు, 3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మిగిలిన అనేక ప్రాంతాల్లో మూడు సెంటీమీటర్ల వర్షం కురిసిందని వాతావరణశాఖ పేర్కొంది. బికనీర్, జోధ్‌పూర్ డివిజన్‌లలో బుధవారం ఓ మాదిరి వర్షపాతం నమోదవగా, జూన్ 23 నుంచి 26 వరకూ వాతావరణం పొడిగా ఉంటుందని వాతావరణశాఖ వివరించింది. అలాగే జూన్ 26-27 మధ్య ఉదయ్‌పూర్, కోట డివిజన్‌లలో వర్షం పడే అవకాశం ఉన్నట్టు వివరించింది.

కశ్మీర్‌లో పొంగిపొర్లుతున్న నదులు

శ్రీనగర్: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కశ్మీర్‌లోని నదుల్లో నీటిమట్టం గణనీయంగా పెరిగింది. బుధవారం అనంతనాగ్ జిల్లాలోని సంగం వద్ద జీలం నది వరద ప్రమాద హెచ్చరిక గుర్తును దాటిందని అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్టు అధికారులు తెలిపారు. కశ్మీర్ అంతటా భారీ వర్షపాతం నమోదవడంతో లోయలోని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క వర్షాలు పడుతున్నా, అమర్‌నాథ్ పుణ్యక్షేత్రంలో మంచు విపరీతంగా కురుస్తూ, పగటి ఉష్ణోగ్రతలు పడిపోతున్నట్టు అధికారులు తెలిపారు. అనంత్‌నాగ్ జిల్లాలోని సంగం వద్ద నీటి మట్టం 18.18 అడుగులకు చేరిందని, వరద హెచ్చరిక కోసం 18 అడుగుల మార్కు కంటే స్వల్పంగా ఉందని అధికారులు వివరించారు. ప్రధానంగా కుల్గాం జిల్లా గుండా ప్రవహించే వైషోవ్ వాగు వరద హెచ్చరికల మార్కును దాటి ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. అయితే ఉదయం 10.00 గంటల నుంచి నీటిమట్టం తగ్గుముఖం పట్టిందని అధికారులు తెలిపారు. అలాగు దూద్‌గంగా ప్రవాహం కూడా ప్రమాదహెచ్చరికను దాటి ప్రవహిస్తోంది.

ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు జెడ్+ భద్రత

న్యూఢిల్లీ: ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు సీఆర్‌పీఎఫ్ కమాండోలతో జెడ్+ భద్రతను కేంద్రం కల్పించినట్లు అధికారులు బుధవారం తెలిపారు. 64 ఏళ్ల ముర్ము భద్రతను సాయుధ దళం చేపట్టిందని బుధవారం ఉదయం సీనియర్ అధికారి ఒకరు పీటీఐకి తెలిపారు. జార్ఖండ్ గవర్నర్‌గా పనిచేసిన ఒడిశాకు చెందిన పార్టీ నాయకురాలు ద్రౌపది ముర్ము అభ్యర్థిత్వాన్ని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా మంగళవారం రాత్రి పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశం తరువాత విలేకరుల సమావేశంలో ప్రకటించిన సంగతి విదితమే. ఈ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర సీనియర్ నాయకులు ఉన్నారు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ... ముర్ము భద్రత బాధ్యతలు చేపట్టేందుకు వీఐపీ సెక్యూరిటీ ప్రొటెక్షన్ టీమ్‌ను నియమించాల్సిందిగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్)ని ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. పారా 14 నుంచి 16 మంది పారా మిలిటరీ సిబ్బంది ముర్ముకు భద్రతగా ఉంటారు. రాష్ట్రం లేదా దేశంలో ఆమె ఎక్కడకు వెళ్లినా ఈ భద్రతా బృందం వెన్నంటి వుంటుంది. ఒడిశాలోని రాయ్‌రంగపూర్‌లో గల ఆమె ఇంటి వద్ద కూడా భద్రతా సిబ్బందిని నియమించారు. తనకు మద్దతు తెలపాల్సిందిగా వివిధ రాజకీయపక్షాల నాయకులు, ప్రజాప్రతినిధులను కలిసేందుకు వచ్చేనెలలో ముర్రు విస్తృతంగా పర్యటించే అవకాశాలున్నాయి.

క్రిమి సంహారాలపై జీఎస్టీ తగ్గించాలి

ధనుకా అగ్రీటెక్ చీఫ్ డిమాండు

న్యూఢిల్లీ : వ్యవసాయానికి సంబంధించి విత్తనాలు, ఎరువుల తరహాలోనే క్రిమి సంహారాలపై 18శాతంగా ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించాలని ధనుకా అగ్రిటెక్ గ్రూపు చైర్మన్ ఆర్‌జీ అగర్వాల్ బుధవారం కేంద్రప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆగ్రో-కెమికల్ రంగాన్ని పీఎల్‌ఐ పరిధిలోకి తేవాలని, అంతర్జాతీయ తయారీ హబ్బుల ఏర్పాటుకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. పంట నష్టాలను తగ్గించేందుకు క్రిమి సంహారాలు కీలకం. అందుకే వాటిపై 18శాతంగా ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించడం అవసరం అని విలేకరులతో మాట్లాడిన అగర్వాల్ నొక్కిచెప్పారు. అగ్రో కెమికల్ ఫార్ములేషన్లపై దిగుమతి సుంకాన్ని కూడా 10శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించాలన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో సంభవించే పంట నష్టాలను తగ్గించేందుకు కొత్త పెస్టిసైడ్ టెక్నాలజీని తేవాలన్నారు. నకిలీ క్రిమి సంహారాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వాన్ని ఆయన కోరారు.

హరియాణా మున్సిపల్ ఫలితాలు విడుదల

అధిక స్థానాల్లో స్వతంత్రుల విజయం

చండీగఢ్ : హరియాణలోని 18 మున్సిపల్ కౌన్సిల్స్, 28 మున్సిపాలటీలకు జరిగిన ఎన్నికల ఫలితాలు బుధవారం వెడుదలయ్యాయి. అధికార బీజేపీ, జేజేపీ కూటమికి చెందిన అభ్యర్థులు అత్యధిక స్థానాల్ని గెలుచుకున్నా వారికి సమానంగా స్వతంత్రంగా బరిలో నిలిచిన అభ్యర్థులు గెలుపొందారు. 28 మున్సిపాలిటీల్లో 12 స్థానాల్ని బీజేపీ కైవశం చేసుకోగా, రెండు చోట్ల జననాయక్ జనతా పార్టీ చేజిక్కించుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ ఒక స్థానంలో గెలుపొందగా, 13 చోట్ల స్వతంత్రులు గెలుపొందినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఇందర్ జీత్ తెలిపారు. ఇక 18 మున్సిపల్ కౌన్సిల్స్‌కు సంబంధించి 15 చోట్ల ఫలిలాలు వెలువడగా ఇందులో 8 స్థానాల్లో బీజేపీ గెలుపొందింది.

జేజేపీకి ఒక స్థానం, ఐఎన్‌ఎల్‌డీ ఒకచోట గెలుపొందగా ఐదు చోట్ల స్వతంత్రులు గెలుపొందినట్టు తెలిపారు. భివానీ, బహదూర్‌ఘర్, పల్వాల్ కౌన్సిల్‌ల ఫలితాలు త్వరలో వెలువడనున్నట్టు పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో 13 చోట్ల, మున్సిపల్ కౌన్సిల్స్‌లో ఐదు చోట్లు స్వతంత్రులు గెలుపొందడం విశేషం. బీజేపీ సహా ఇతర పార్టీల అభ్యర్థులు తమ పార్టీ గుర్తులపై పోటీకి దిగగా కాంగ్రెస్ పార్టీకి చెందిన చాలా మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

విశాలాంధ్ర 70వ వార్షికోత్సవ సంబరాలు

వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తున్న విశిష్ట అతిథి ఏటుకూరి ప్రసాద్

ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

భాగవతుల వెంకట రామశర్మ శిష్యబృందం నృత్య ప్రదర్శన

ఆర్వీ రామారావు

ముప్పాళ్ల నాగేశ్వరరావు

జల్లి విల్సన్

గద్దం కోటేశ్వరరావు

హరినాథరెడ్డి

కూన అజయ్‌బాబు

అభ్యుదయ గేయాలాపనతో ఉర్రూతలూగిస్తున్న చంద్రానాయక్, పెంచలయ్య, శ్రీనివాస్, పిచ్చయ్య

గోనుగుంట్ల యల్లమందరావు బృందం నాదస్వర కచేరి

విశాలాంధ్ర పూర్వ జనరల్ మేనేజర్ వై.చెంచయ్య, పూర్వ అసిస్టెంట్ ఎడిటర్ ఎస్కే బాబుకు సత్కారం

విశాలాంధ్ర ప్రత్యేక సంచిక ఆవిష్కరణ దృశ్యం

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

విశాలాంధ్ర-విజయవాడ : విశాలాంధ్ర దినపత్రిక 70వ వార్షికోత్సవాన్ని బుధవారం విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విశాలాంధ్ర ఘనకీర్తిని కొనియాడుతూ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రానాయక్, ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, దళిత డప్పుకళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసరావు అద్భుతంగా గేయాలు ఆలపించారు. ప్రముఖ కూచిపూడి నృత్యాచార్యులు భాగవతుల వెంకట రామశర్మ శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. విశాలాంధ్ర గొప్ప చరిత్రను వివరిస్తూ చిన్నారులు వి.మనోజ్ఞ కామేశ్వరి, కె.వైష్ణవి సాయి, బి.స్వాతికిరణ్, వి.తేజశ్వి, బి.తన్మయి కిరణ్, ఎస్.లలిత, ఎస్.భార్గవి, బి.బిందు అద్భుతంగా నృత్యప్రదర్శన చేశారు. గోనుగుంట్ల యల్లమందరావు బృందం నాదస్వర కచేరి ఆకట్టుకుంది. యల్లమందరావుతో పాటు ఆయన బృంద సభ్యులు నాగమణి, మహేంద్ర(డోలు), రాజశేఖర్, పార్వతి, అంజలి(నాదస్వరం) తమ వాయిద్య ప్రదర్శనతో అలరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.